జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | సోమవారం 19 అక్టోబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 223 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , భాద్రపద మాసము , తిథి: అమావస్య - 21:20:56 వరకు నక్షత్రంహస్త - 21:42:57 వరకు కరణంచతుష్పాద - 09:25:49 వరకు, నాగవ - 21:20:56 వరకు పక్షంకృష్ణ యోగంఐన్ద్ర - 22:01:52 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL   http://www.prajajyothinews.com   Mail: prajajyothidaily@gmail.com

బహిష్టు పరిశుభ్రత ప్రాథమిక హక్కు

రుతుక్రమ ఆరోగ్యంపై రాష్ట్రాల నిర్లక్ష్యం

రాష్ట్రాలపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం

రుతుక్రమ ఆరోగ్యాన్ని (బహిష్టు పరిశుభ్రత) ప్రాథమిక హక్కులో భాగంగా గుర్తిస్తూ ఇచ్చిన తీర్పు అమలుపై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు స్పందించక పోవడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం కోరినప్పటికీ ఇప్పటివరకు అవసరమైన వివరాలు అందించకపోవడంపై

మిగతా 2లో..

ఆర్మీ మేజర్ భార్య ఏఐతో గూఢచర్యం!

దేశ రహస్యాలు చైనా చేతుల్లోకి..?

ఫోన్‌లో కీలక రక్షణ రహస్యాలు..

భద్రతా దళాల అదుపులో మహిళ

సికింద్రాబాద్‌కు చెందిన ఈ మహిళ, భారత సైన్యంలో మేజర్ హోదాలో పనిచేస్తున్న అధికారితో వివాహం చేసుకుని జమ్మూ కశ్మీర్‌లో నివసిస్తున్నారు. జాతీయ

మిగతా 2లో..

అంబరాన్నంటిన
సద్దులు..

హోరెత్తిన బతుకమ్మ సంబురాలు

ఊరూరా పెద్ద బతుకమ్మ వైభవం

ట్యాంక్‌బండ్‌పై ఘనంగా వేడుకలు..

ప్రత్యేక ఆకర్షణగా రష్మిక-విజయ్ జంట

తెలంగాణ రాష్ట్రంలో సద్దుల బతుకమ్మ సంబురాలు ఈ ఏడాది మరింత ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిదిరోజుల పాటు సాగిన పూల పండుగ ఆదివారం సద్దులతో వైభవంగా ముగిసింది. తీరొక్క రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆలయాలు, కూడళ్లు, చెరువు, కాలువల గట్ల వద్దకు చేరుకొని ఆడబిడ్డలు ఆడిపాడారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు గౌరమ్మ ఉయ్యాలో' అంటూ ఊరూరా బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. అనంతరం వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. 'పోయిరా గౌరమ్మ పోయిరావమ్మ.. మళ్లొచ్చే ఏడాదికి తిరిగి రావమ్మ' అంటూ వీడ్కోలు పలికిన

మిగతా 2లో..

ఫ్యూచర్ సిటీలో నేడు
సీఎం పర్యటన

పోలీస్ కమిషనరేట్ ప్రారంభోత్సవం

కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు

ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిపై సీఎం సమీక్ష

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేడు ఫ్యూచర్ సిటీ పరిధిలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన నూతన పోలీస్ కమిషనరేట్ ప్రారంభోత్సవంతో పాటు విద్యా, పట్టణ ప్రణాళికా రంగాలకు సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం వేదికగా ప్రారంభం కానుంది. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు పరిధిలో పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలను పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం 'ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్'ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం 3:30 గంటలకు ఇబ్రహీంపట్నంలో నూతనంగా ఏర్పాటైన ఈ పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా ప్రారంభించి, పోలీసు విభాగ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం సీఎం భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాంగణానికి చేరుకుంటారు. సాయంత్రం 5:30 గంటల సమయంలో అక్కడ శరవేగంగా నిర్మాణ పనులు జరుపుకుంటున్న ప్రతిష్ఠాత్మక 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' ప్రాంగణాన్ని సందర్శించనున్నారు. రాష్ట్ర యువతలో అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టిన ఈ వర్సిటీలో జరుగుతున్న మౌలిక వసతుల పనులను, కోర్సుల రూపకల్పన పురోగతిని ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలిస్తారు. యూనివర్సిటీ ప్రాంగణంలోనే

మిగతా 2లో..

బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్ పై కాల్పులు

దాడి నుంచి సురక్షితంగా బయటపడ్డ టైగర్

నిందితుల కోసం 12 బృందాలతో గాలింపు

పరామర్శించిన డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్..

దాడికి బాధ్యత మాదే: లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న కారుపై కాల్పుల ఘటన ముంబైలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఆదివారం సాయంత్రం జుహు ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో ఆయన త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, అయితే ఆయన డ్రైవర్ గాయపడ్డారని ముంబై పోలీసులు ధ్రువీకరించారు. వివరాల్లోకి వెళితే, ఆదివారం సాయంత్రం ఫుట్‌బాల్ ఆడి తన బీఎండబ్ల్యూ కారులో ఇంటికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. జుహు పోలీస్ స్టేషన్ పరిధిలోని పుష్పా పార్క్ సమీపంలోకి రాగానే, మోటార్‌సైకిల్‌పై వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఆయన కారును లక్ష్యంగా చేసుకుని మూడు నుంచి

మిగతా 12లో..

ఆలయాలకు
భారీ నిధులు

ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు

భద్రాచలం, బాసర ఆలయాల ఆధునీకరణ

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన

తెలంగాణలో ప్రముఖ ఆలయాల అభివృద్ధి, ఆధునికీకరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధి పనుల కోసం రూ. 2,500 కోట్లతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆధ్యాత్మిక కేంద్రాలకు రవాణా సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలోని గార్లఒడ్డు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు నాచారం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి ఆయన దర్శించుకున్నారు. మీరు మెచ్చే

మిగతా 2లో..

టామ్‌కామ్ వ్యవహారంపై సీఐడీ విచారణ జరిపించాలి

విదేశాల ఉద్యోగాలపై ప్రభుత్వం శ్వేతపత్రం ఇవ్వాలి

వసూలు చేసిన ప్రతి పైసా ప్రభుత్వం తిరిగి ఇవ్వాలి

రేవంత్ సర్కార్ జాబ్ రాకెట్.. టామ్‌కామ్ వ్యవహారం

నిరుద్యోగులను నిలువునా ముంచింది: హరీశ్ రావు

జర్మనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం టామ్‌కామ్ ద్వారా నిరుద్యోగులను నిలువునా ముంచిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలోని 75 మంది యువత నుంచి రూ. 4.5 లక్షల చొప్పున వసూలు చేసి రెండేళ్లుగా మోసం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పుస్తెలతాళ్లు తాకట్టుపెట్టి డబ్బులు కట్టినవారికి, ఇప్పటివరకు కనీసం ఒక్క ఇంటర్వ్యూ కూడా జరగలేదని ఆరోపించారు.

మిగతా 12లో..

విజయవాడ-హైదరాబాద్ హైవేపై భారీగా ట్రాఫిక్

దసరా పండుగ సందడితో కిక్కిరిసిన రహదారులు

రోడ్లపై కిలోమీటర్ల మేర బారులుతీరిన వాహనాలు

పండుగ సందర్భంగా హైదరాబాద్‌లో నివసిస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు తమ సొంతూళ్ల బాట పట్టారు. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో ప్రయాణికులతో రోడ్లు, బస్టాండ్లు కిక్కిరిసిపోతున్నాయి. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు బారులుతీరాయి. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నుంచి పంతంగి టోల్ ప్లాజా వరకు 46 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సాధారణ సమయాల్లో దాదాపు గంటసేపట్లో ఈ దూరాన్ని చేరుకోవచ్చు. అయితే వాహనాల రద్దీ భారీగా పెరగడంతో పాటు చౌటుప్పల్ దగ్గర అండర్‌పాస్ వంతెన నిర్మాణ పనులు

మిగతా 2లో..

ఆరు నెలల్లో రూ.405 కోట్ల నష్టం!

నష్టాల బాటలో హైదరాబాద్ మెట్రో..

మెట్రోపై భారీగా రుణాల వడ్డీ భారం

సగటున సుమారు రూ. 2.85 కోట్లు..

హైదరాబాద్ మెట్రోరైలు ఆర్థిక కష్టాలు కొనసాగుతున్నాయి. మెట్రో మొదటి దశ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ స్వాధీన ప్రక్రియలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. మరోవైపు మెట్రో ఆదాయం కొంత పెరిగినా.. ఖర్చులు అంతకంటే ఎక్కువగా ఉండటంతో నష్టాలు మరింత విస్తరిస్తున్నాయి. 2026 సెప్టెంబరు 30తో ముగిసిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు రూ. 405.86 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ. 380.46 కోట్ల నష్టం నమోదైంది. అంటే ఏడాది వ్యవధిలో అర్ధ వార్షిక నష్టాలు రూ. 25.40 కోట్లు పెరిగాయి. మెట్రో నిర్వహణను ప్రభుత్వం చేపట్టాలన్న ప్రతిపాదనకు ఆర్థికపరమైన అంశాలు కీలకంగా మారుతున్నాయి. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఆరు నెలల్లో మెట్రోరైలు కార్యకలాపాలు, ఇతర ఆదాయ మార్గాల ద్వారా మొత్తం రూ. 524.78 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన రూ. 497.54 కోట్లతో

మిగతా 2లో..

పాక్ గగనతలంలో భారత విమానాలపై నిషేధం పొడిగింపు

భారత్‌కు చెందిన విమానాలపై విధిస్తున్న గగనతల నిషేధాన్ని పాకిస్థాన్ మరో నెల రోజుల పాటు పొడిగించింది. ఈ ఆంక్షలు నవంబర్ 24 వరకు అమల్లో ఉంటాయని పాకిస్థాన్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (పీఏఏ) వెల్లడించింది. భారత్‌లో నమోదు చేసుకున్న వాణిజ్య విమానాలతో పాటు, ఆ దేశానికి చెందిన సంస్థలు లీజుకు తీసుకున్న లేదా నడుపుతున్న ప్రయాణికుల విమానాలు, అలాగే మిలిటరీ సైనిక విమానాలకు సైతం ఈ నిషేధం వర్తిస్తుందని పాకిస్థాన్ స్పష్టం చేసింది. రెండు దేశాల మధ్య దెబ్బతిన్న దౌత్య, సైనిక సంబంధాల కారణంగా 2025 ఏప్రిల్ 23న పాకిస్థాన్ తొలిసారిగా

మిగతా 2లో..

సంపాదకీయం

మనిషి అవసరం తగ్గనుందా?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఉద్యోగ రంగాన్ని వేగంగా మార్చేస్తోంది. ఇప్పటికే పలు సంస్థల్లో ఉద్యోగుల పనితీరును మెరుగుపరిచేందుకు ఏఐ టూల్స్, ఏఐ ఏజెంట్లను విస్తృతంగా వినియోగిస్తున్నారు. అయితే ఈ సాంకేతికత కారణంగా కొత్త ఉద్యోగాల నియామకాలు, ముఖ్యంగా జూనియర్ స్థాయి టెక్నికల్ పోస్టులపై ప్రభావం పడుతోంది. ప్రముఖ ఏఐ సంస్థ ఆంత్రోపిక్ తాజాగా విడుదల చేసిన అధ్యయనం ఈ మార్పులను వెల్లడించింది.. మరోవైపు మానవ చరిత్రలో ఎన్నడూ లేనంతగా నేడు ప్రపంచం సాంకేతికత ద్వారా అనుసంధానమైంది. చేతిలోని స్మార్ట్‌ఫోన్‌తో ప్రపంచంలో ఎక్కడి వ్యక్తితోనైనా క్షణాల్లో మాట్లాడవచ్చు. కానీ విచిత్రమేమిటంటే, ఇదే కాలంలో డిజిటల్ అనుసంధానాల మధ్య ఒంటరితనం కూడా పెరుగుతోంది. ఈ మానసిక శూన్యతను ఆసరాగా చేసుకుని ఓ కొత్త సాన్నిహిత్యం ముందుకొస్తోంది. అదే ఏఐ సహచరి. ఈ సహచరి మనిషి ఒంటరితనానికి పరిష్కారమా, లేక మనిషికి మనిషి అవసరాన్ని క్రమంగా తగ్గించే స్థాయికి చేరువ అవుతోంది. ఏ ఇద్దరి మధ్య బంధమైనా నిలవాలంటే ఓపిక, త్యాగం, సర్దుబాటు అవసరం. మన ఆలోచనలు ఎదుటివారి ముందు ఉంచడం, వారి అభిప్రాయాలతో విభేదిస్తూనే వారిని అర్థం చేసుకోవడం-- ఇదే మానవ సంబంధాల ప్రాథమిక సూత్రం. ఇక్కడ కోపాలు, అసంతృప్తులు, ఘర్షణలు, సంతోషాలు అన్నీ ఉంటాయి. కానీ ఈ చాట్‌బాట్‌లు అందించే 'కల్పిత ప్రేమ'లో ఈ కష్టాలు కనిపించవు. అది మిమ్మల్ని ప్రశ్నించదు. మీ తప్పులను వేలెత్తి చూపదు. మీరు ఎప్పుడు పిలిచినా 'నేను నీ కోసమే' అన్నట్టు స్పందిస్తుంది. ఇంట్లో వాళ్లకు చెప్పలేని మాటను, స్నేహితుడితో పంచుకోలేని బాధను కొందరు చాట్‌బాట్‌తో చెప్పుకుంటున్నారు. ఈ సాన్నిహిత్యం ఇప్పుడు మాటలకే పరిమితం కాలేదు. ఏఐపై 2026లో జరిగిన ఒక అధ్యయనంలో, పరిశీలించిన దాదాపు 1500 ప్రముఖ చాట్‌బాట్లలో 63శాతం రొమాంటిక్ సంభాషణల కోసం రూపొందించినట్టు తేలింది. కొన్ని బాయ్‌ఫ్రెండ్, భర్త, ప్రేమికుడి వంటి పాత్రలను కూడా అనుకరిస్తున్నాయి. మనిషి కోరుకునే సాన్నిహిత్యం కూడా క్రమంగా ఒక డిజిటల్ సేవగా మారుతోంది. అది మన భావాలకు అనుగుణంగా స్పందిస్తుంది. మన అభిప్రాయాన్ని మెచ్చుకోవడం, మన మాటకు అంగీకారం తెలపడం వంటి ప్రవర్తనను పరిశోధకులు 'ఏఐ సైకోఫాన్సీ' (ముఖస్తుతి)గా పేర్కొంటున్నారు. స్టాన్‌ఫర్డ్--కార్నెగీ మెలన్ పరిశోధకుల అధ్యయనంలో 11 ప్రముఖ ఏఐ మోడళ్లు మనుషుల కంటే సగటున 49శాతం ఎక్కువగా తమను వాడేవారి చర్యలను సమర్థించాయి. ఇలాంటి చాట్‌బాట్‌తో సంభాషించిన తర్వాత ఆ మనుషుల్లో తమ ప్రవర్తనే సరైనదన్న నమ్మకం పెరగడం, తప్పును అంగీకరించి సంబంధాన్ని చక్కదిద్దుకునే ఆసక్తి తగ్గింది. మనుషులు సహజంగా ప్రవర్తించే తీరు కూడా ఇలాగే ఉంటుంది. ఎవరు మనల్ని ఎప్పుడూ 'నువ్వు కరెక్టే' అని చెప్తారో, వారి దగ్గరికే మనం వెళ్తాం. ఫ్లోరిడాలో పద్నాలుగేళ్ల బాలుడు ఒక చాట్‌బాట్‌తో తీవ్ర భావోద్వేగ అనుబంధం పెంచుకున్న తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడు. అతని తల్లి దాఖలు చేసిన కేసులో చాట్‌బాట్ పాత్రపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. అయితే ఆత్మహత్యకు చాట్‌బాటే కారణమని నిర్ధారించడం సాధ్యం కాలేదు. కానీ ఈ ఘటన కృత్రిమ తోడు ఒక పిల్లవాడి జీవితంలో ఎంత లోతుగా ప్రవేశించగలదో చూపించింది. బ్రిటిష్ కొలంబియా పరిశోధకుల 12 నెలల అధ్యయనంలో 2 వేల మందికి పైగా పెద్దలను పరిశీలిస్తే, ఒంటరితనం అనుభవించేవారు చాట్‌బాట్‌ల వైపు మొగ్గుచూపడం కనిపించింది. మరో అధ్యయనంలో చాట్‌బాట్ వినియోగం తర్వాత ఒంటరితనం పెరిగినట్టు సంకేతాలు కనిపించినా, విస్తృత సామాజిక అనుబంధం తగ్గిందని మాత్రం నిర్ధారించలేకపోయారు. 025 మే నుంచి 2026 మే మధ్య సంస్థలో లెక్నికల్ ఉద్యోగాల నియామకాల వాటా 27 శాతం నుంచి 9 శాతానికి పడిపోయింది. అదే సమయంలో ఏఐ ఏజెంట్లు మానవ నిర్వహించే మానవ ఉద్యోగులతో పోలిస్తే ఆరు రెట్లు ఎక్కువ గంటల పాటు పనిచేస్తున్నట్లు అధ్యయనం పేర్కొంది. ఆంత్రోపిక్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌తో పాటు సేల్స్, న్యాయ, ఆర్థిక విభాగాల్లోనూ ఏఐ వినియోగం పెరిగింది. గతంలో ఉద్యోగులు స్వయంగా నిర్వహించిన అనేక పనులను ఇప్పుడు ఏఐ ఏజెంట్లకు అప్పగిస్తున్నారు. దీంతో ఉద్యోగుల నుంచి ఆశించే నైపుణ్యాల్లోనూ మార్పులు వస్తున్నాయని సంస్థ తెలిపింది. ముఖ్యంగా ఒకేసారి అనేక ఏఐ ఏజెంట్లను నిర్వహించడం, వాటి నుంచి వచ్చిన ఫలితాలను పరిశీలించడం, అవసరమైన మార్పులు చేయడం వంటి నైపుణ్యాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఒక ఇంజినీర్ తన పని అనుభవాన్ని వివరిస్తూ.. తన దృష్టిని కోరుతూ అనేక క్లాడ్ ఏజెంట్లు ఒకేసారి పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఐ ప్రభావం జూనియర్ టెక్నికల్ ఉద్యోగాలకే పరిమితం కాలేదు. సంస్థలో సాంకేతిక విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల మొత్తం వాటా కూడా గత ఏడాదిలో 61 శాతం నుంచి 56 శాతానికి తగ్గింది. ఆంత్రోపిక్‌లో ఏఐ వినియోగం కేవలం కోడింగ్‌కే పరిమితం కాలేదు. వినియోగదారులను పలకరించే సందేశాలు, గ్రీటింగ్స్ రాసే పనులను కూడా ఏఐ ఏజెంట్లకు అప్పగించినట్లు అధ్యయనం వెల్లడించింది. గతంలో ఈ పనులను మానవ రచయితలు నిర్వహించేవారు. ఇప్పుడు ఏఐ రాసిన చేయడంతో మానవ రచయితలకు మిగిలే పని ఏమిటనే ప్రశ్న తలెత్తిందని సంస్థ పేర్కొంది. ఏఐ కారణంగా ఉద్యోగాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశాలను ముందుగానే గుర్తించేందుకు సంస్థ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రభావితమయ్యే ఉద్యోగులను వారి నైపుణ్యాలకు సరిపోయే, తక్షణమే ఏఐ ప్రభావానికి గురయ్యే అవకాశం తక్కువగా ఉన్న ఇతర విభాగాలకు మార్చే అవకాశాలను పరిశీలిస్తోంది. సంస్థలో ఏదానికి పైగా పనిచేసిన ఉద్యోగుల ఇతర విభాగాలకు మారే అవకాశం 50 శాతం ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం తెలిపింది. ఉద్యోగుల్లో భవిష్యత్తుపై ఆందోళన పెరిగితే వారి పనితీరుపై ప్రభావం పడుతుందని సంస్థ చెబిన ఓ అధికారి అభిప్రాయపడ్డారు. ఏఐ ఏజెంట్లు ఉద్యోగాలపై ప్రభావం చూపుతున్నప్పటికీ, వాటి వల్ల ఉత్పాదకత పెరుగుతోందని అధ్యయనం వెల్లడించింది. ఏఐ కోడింగ్ ఏజెంట్లను ఉపయోగించిన 192 మంది ఇంజినీర్లను, వారిని ఉపయోగించని 74 మంది ఇంజినీర్లను పరిశోధకులు పరిశీలించారు. ఏఐ ఏజెంట్లను వినియోగించడం ప్రారంభించిన తర్వాత ఇంజినీర్ల పని ఉత్పత్తి గణనీయంగా పెరిగినట్లు గుర్తించారు. ఏఐ రాసిన కోడ్, మనుషులు రాసిన కోడ్‌ను తర్వాత తొలగించే రేట్లలో మాత్రం గణనీయమైన తేడా కనిపించలేదని అధ్యయనం పేర్కొంది. ఏఐ ఏజెంట్ల వినియోగం సాంకేతిక విభాగాలకే పరిమితం కాలేదు. న్యాయవాదులు, అకౌంట్ మేనేజర్లు, సేల్స్ ప్రతినిధులు సహా ఇతర ఉద్యోగులు కూడా వీటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

విజయవాడ-హైదరాబాద్ హైవేపై భారీగా ట్రాఫిక్

మొదటిపేజీ తరువాయి..

జరుగుతుండటంతో ప్రస్తుతం ఈ ప్రయాణానికి దాదాపు 3 గంటల సమయం పడుతోంది. చౌటుప్పల్ నుంచి ధర్మోజీగూడెం మధ్యలో సుమారు 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడం నుంచి కొంత ట్రాఫిక్‌ను వలిగొండ రోడ్డు మీదుగా విజయవాడ జాతీయ రహదారికి మళ్లించారు. ఇక పంతంగి టోల్ ప్లాజా వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో అర కిలోమీటరు మేర వాహనాలు లైన్లలో నిలిచిపోతున్నాయి. ఈ రద్దీని నియంత్రించేందుకు టోల్‌ప్లాజా సిబ్బంది విజయవాడకు వెళ్లే మార్గంలో 12 టోల్ బూత్‌లను తెరిచి, వాహనాలను తరలించారు. ఈ మార్గంలో రేపు కూడా ఇదే తరహా ట్రాఫిక్ ఉండే అవకాశం ఉంది. చౌటుప్పల్ దగ్గర జరుగుతున్న అండర్ పాస్ నిర్మాణ పనుల దృష్ట్యా ఈ పట్టణాన్ని దాటడానికి సుమారు 45 నిమిషాలకు పైగా సమయం పడుతోంది. రాత్రిపూట ఈ ప్రయాణ సమయం మరింత పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ చౌటుప్పల్ దాటినా చిట్యాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఇక్కడ ఫ్లైఓవర్ పనులు జరుగుతుండటంతో సాధారణంగానే వాహనాలు నిదానంగా వెళ్తుండటంతో ట్రాఫిక్ ఏర్పడుతోంది. ప్రస్తుతం పండగ సీజన్ కావడంతో ఈ రద్దీ 4 రెట్లు పెరిగింది. దీంతో ఇక్కడ కూడా వాహనదారులు సుమారు గంట సేపు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు.

పాక్ గగనతలంలో భారత విమానాలపై నిషేధం పొడిగింపు

మొదటిపేజీ తరువాయి..

ఈ గగనతల నిషేధాన్ని విధించింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ల మధ్య తీవ్ర స్థాయిలో వివాదం చెలరేగింది. ఈ దాడిలో పాకిస్థాన్ ప్రమేయం ఉందంటూ భారత్ ఆరోపించింది. పాకిస్థాన్ ఆ ఆరోపణలను ఖండించింది.

అంబరాన్నంటిన సద్దులు..

మొదటిపేజీ తరువాయి..

మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. హనుమకొండలోని పద్మాక్షి గుట్ట, వడ్డేపల్లి చెరువు, వరంగల్‌లోని చిన్నవడ్డేపల్లి చెరువు, రంగలీలా మైదానం, జనగామలోని బతుకమ్మ కుంట, జయశంకర్ భూపాలపల్లిలోని అంబేద్కర్ స్టేడియం, మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం, ములుగులోని మినీ ట్యాంక్‌బండ్‌లో వద్ద నిర్వహించిన వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనగా, ఆయా ప్రాంతాలు పూలవనాలను తలపించాయి. కాగా, వలుచోట్ల ప్రభుత్వం బతుకమ్మ పండుగ కోసం విద్యుద్దీపాలు ఏర్పాటుచేయకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మరోవైపు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ వేడుకలను అట్టహాసంగా నిర్వహించింది. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ సమీపంలో ట్యాంక్‌బండ్ వద్ద భారీ ఏర్పాట్లు చేసింది.

ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై వేడుకకు మరింత వన్నె తెచ్చారు. కళాకారులు మహిళలు బతుకమ్మను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ప్రధాన వేదిక వద్దకు చేరుకున్నారు. తెలంగాణ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుక ట్యాంక్‌బండ్ వద్ద ఘనంగా జరిగింది. గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, సినీ నటుడు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు హాజరయ్యారు. మన పూర్వీకులు ఇచ్చిన వారసత్వ సంపద సంస్కృతి సంప్రదాయాలు నేటితరానికి అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. నీటి వృథాను అరికట్టి, జల వనరులను సంరక్షించుకోవడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా సందేశం ఇచ్చారు. ప్రజలందరికీ బతుకమ్మ పండగ శుభాకాంక్షలు చెప్పిన ఆయన అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.అమరవీరుల స్తూపం నుంచి కళాకారులు, మహిళలతో కలిసి మంత్రి సీతక్క బతుకమ్మలను ఊరేగింపుగా ట్యాంక్‌బండ్ వద్దకు తీసుకువచ్చి అక్కడ వారంతా ఆడి పాడారు. ప్రకృతి, పండగలను కాపాడుకుంటూ అందరం ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని సీతక్క ఆకాంక్షించారు. వేడుకకు సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారికి సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క సన్మానించారు. వేడుకలకు పిలవగానే వచ్చిన విజయ్ రష్మికలను జూపల్లి అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన సంస్కృతి, పండగలను ప్రపంచ ప్రాచుర్యం పొందేలా ఘనంగా నిర్వహిస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అనంతరం మాట్లాడిన విజయ్ రష్మికలు ప్రజలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. తెలంగాణ కోడలిగా బతుకమ్మ పండుగలో పాల్గొని అందరితో ఆడి పాడడం అదృష్టంగా భావిస్తున్నట్టు రష్మిక తెలిపారు.

కాగా పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ. తీరొక్క పూలతో పేర్చి పూజించే పూలపల్లకి, గంగమ్మ, గౌరమ్మ కలిసి ఆరుద్దెన వేడుక బతుకమ్మ సంబరం. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి పడతులు పులకించి పోతారు. తొమ్మిది రోజుల పాటు నిండైన పూలతో ప్రకృతి పాలపుంతగా గోచరించే వేడుక అద్భుతమైన పల్లె పండుగ. మహాలయ అమావాస్య నుంచి దుర్గాష్టమి వరకు పిల్లాపెద్దా తేడా లేకుండా ఈ పండుగను

జరుపుకుంటారు. తొమ్మిదిరోజుల పాటు పాటు జరుపుకునే ఈ బతుకమ్మ పండుగలో చివరి రోజు ఎంతో ప్రత్యేకం. ఆశ్వయుజ అష్టమి లేదా దుర్గాష్టమినే సద్దుల బతుకమ్మ అంటారు. పెత్రమాసతో మొదలైన నవరాత్రులు నేటితో ముగుస్తాయి. ఆశ్వయుజ మాసంలో ఎనిమిదో రోజైన దుర్గాష్టమి నాడు బతుకమ్మను 'సద్దుల బతుకమ్మ'గా జరుపుకుంటారు. అలసిన అమ్మవారికి భక్తులు పాకాలు నివేదన చేస్తారు. ఈ రోజున సద్దుల పేరుతో పులగమన్నం, చిత్రాన్న, పులిహోర, నువ్వుల సద్ది, పెరుగన్నం, కొబ్బరి సద్ది, ఇలా రకరకాల సద్దులు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. అందుకే చివరి రోజు వేడుకను సద్దుల బతుకమ్మ అని పిలుస్తారు. దీన్ని 'పెద్ద బతుకమ్మ' అని కూడా పిలుస్తారు. తంగేడు, బంతి, చామంతి, గునుగు, సీతజడ, కలువ, గడ్డిపూలు వంటి తీరొక్క పూలతో బతుకమ్మలను పేరుస్తారు. ఇవాళ తల్లి బతుకమ్మ, పిల్ల బతుకమ్మ ఇలా రెండు బతుకమ్మలను పేర్చి పోరెత్తే ఉయ్యాల పాటలతో మహిళలంతా ఎంతో వైభవంగా బతుకమ్మ ఆట ఆడుకుంటారు. వేకువజామునే అందరూ నిద్రలేస్తారు.

ఆరు నెలల్లో రూ.405 కోట్ల నష్టం!

మొదటిపేజీ తరువాయి..

పోలిస్తే ఆదాయం రూ.27.24 కోట్లు పెరిగింది. ప్రయాణికుల రవాణా, ఇతర కార్యకలాపాల ద్వారా ఆదాయం పెరిగినప్పటికీ, పెరుగుతున్న నిర్వహణ వ్యయాలను అధిగమించడానికి అది సరిపోవడం లేదు. ఇదే సమయంలో మెట్రో నిర్వహణ ఖర్చులు, ఉద్యోగుల జీతభత్యాలు, పరిపాలనా వ్యయాలు, నిర్మాణ సంబంధిత ఖర్చులు, రుణాలపై వడ్డీలు, తరుగుదల కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.930.64 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఈ వ్యయాలు రూ.878 కోట్లుగా ఉన్నాయి. దీంతో ఆదాయం, వ్యయాల మధ్య అంతరం మరింత పెరిగింది.మెట్రోరైలు ఆర్థిక పరిస్థితిపై రుణాల వడ్డీ భారం తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే ఫైనాన్స్ ఖర్చులు రూ.522.61 కోట్లకు చేరాయి. మరోవైపు మెట్రో రైళ్ల నిర్వహణకు సంబంధించిన ఖర్చులు రూ.222.88 కోట్లుగా నమోదయ్యాయి. మెట్రోకు వస్తున్న ఆదాయంలో గణనీయమైన భాగం రుణాల వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తోంది. దీంతో నిర్వహణ ఆదాయం పెరిగినా మొత్తం ఆర్థిక ఫలితాల్లో మెరుగుదల కనిపించడం లేదు. మెట్రో మొదటి దశ ప్రాజెక్టు కోసం తీసుకున్న రుణాలపై ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో సగటున 7 నుంచి 8 శాతం వరకు వడ్డీ చెల్లిస్తోంది. ఈ ప్రాజెక్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియలో భాగంగా రుణాలను రీషెడ్యూల్ చేసి వడ్డీ భారాన్ని తగ్గించాలనే ప్రభుత్వ వ్యూహంగా ఉంది. వడ్డీ రేటును 3.5 నుంచి 4 శాతం లోపునకు తగ్గించగలిగితే మెట్రో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని భావిస్తున్నారు. ఇందుకోసం తక్కువ వడ్డీ రేట్లకు రుణాలను పునర్వ్యవస్థీకరించేందుకు ముందుకొచ్చే బ్యాంకుల అన్వేషణ బాధ్యతను ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించారు. ప్రస్తుత అర్ధ వార్షిక గణాంకాల ప్రకారం మెట్రోపై రుణాల వడ్డీ భారం రోజుకు సగటున సుమారు రూ.2.85 కోట్లుగా ఉంటోంది. ఈ భారాన్ని తగ్గించడంతో పాటు ఆదాయ మార్గాలను పెంచడం, నిర్వహణ వ్యయాలను సమర్థంగా నియంత్రించడం ద్వారా మాత్రమే మెట్రో ఆర్థిక పరిస్థితిలో గణనీయమైన మార్పు సాధ్యమవుతుంది. ప్రభుత్వం స్వాధీన ప్రక్రియను ఎప్పుడు పూర్తి చేస్తుంది, రుణాల పునర్వ్యవస్థీకరణకు ఏ మేరకు అనుకూల నిబంధనలు లభిస్తాయన్న అంశాలపైనే మెట్రో భవిష్యత్తు ఆధారపడి ఉంది.

ఆలయాలకు భారీ నిధులు

మొదటిపేజీ తరువాయి..

కథనాలు థైరాయిడ్ తగ్గడానికి ఇంటి చిట్కాలు, మన వంటగదిలో ఉండే మిరియాలు ం పసుపు ం ధనియాలు ం తేనె చాలు! వేడి కావడం లేదా జస్ ప్యాక్, కీళ్ల నొప్పులు ం వాపుకి ఏది బెస్ట్? ఎక్స్‌పర్ట్ ఏమంటున్నారంటే పైల్స్ తగ్గడానికి ఇంటి చిట్కాలు, కర్కాయలు పొడి ం బెల్లం, ఉత్తరేణి గింజల చూర్ణం ం మునగాకు టీ బెస్ట్! ×శ్రీశ్రీల ×శ్రీశ్రీశ్రీల ౖాఙశ్రీశ్రీశ్రీల ఎశీఖ్రూం అక్టోబర్ 19 ఎపిసోడ్: వల్లికి చందు విడాకులు.. తన్నితరమేసిన భాగ్యం.. ఎవరూ లేని ఒంటరైన శ్రీవల్లి ఈ సందర్భంగా ఏన్నూరు నుంచి నాచారం కొండ వరకు రూ.44 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణంతో ఆలయానికి చేరుకునే భక్తులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు స్థానిక ప్రాంతాల అనుసంధానం బలోపేతం కానుంది. ఆలయాలకు వచ్చే భక్తుల రాకపోకలు సులభతరం కావడంతోపాటు ప్రాంతీయ అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని భావిస్తున్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి రూ.276 కోట్లు, బాసర శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.354 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆర్టీకమంత్రిగా ఈ ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆలయాల ఆధునీకీకరణతో భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంతోపాటు రాష్ట్రంలోని ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊతం లభిస్తుందని వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడం, వారికి ఆర్థికంగా చేయూతనివ్వడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు ఎలినినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి నీటిచుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి వనరుల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వెల్లడించారు. నాచారం నుంచి ఉమ్మడి జిల్లాలను కలుపుతూ జూలూరుపాడు వరకు రహదారి నిర్మాణాన్ని మంజూరు చేయాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సభలో కోరారు. దీనిపై స్పందించిన భట్టి విక్రమార్క రహదారి మంజూరుకు హామీ ఇచ్చారు. సభ అనంతరం మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాల చెక్కును అందజేశారు.

ఫ్యూచర్ సిటీలో నేడు సీఎం పర్యటన

మొదటిపేజీ తరువాయి..

నిర్వహించబోయే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ సన్నాహక ఏర్పాట్లపై కూడా అధికారులకు మార్గదర్శనం చేయనున్నారు. పట్టణ ప్రణాళిక, సుస్థిర నగరాల నిర్మాణంలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు గాను సాయంత్రం 6:00 గంటలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ క్యాంపస్ నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా శంకుస్థాపన చేయనున్నారు. ఆధునిక పట్టణీకరణ సవాళ్లను ఎదుర్కొనే నిపుణులను, అర్బన్ ప్లానర్లను తీర్చిదిద్దడంలో ఈ క్యాంపస్ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందనుంది. శంకుస్థాపన కార్యక్రమాల అనంతరం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులతో ముఖ్యమంత్రి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ నెట్‌వర్క్ వంటి మౌలిక వసతుల కల్పన, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడుల ఆకర్షణ, భూసేకరణ పురోగతిపై ఉన్నతాధికారులతో కూలంకషంగా సమీక్షించనున్నారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు ఇప్పటికే ఫ్యూచర్ సిటీ పరిసర ప్రాంతాల్లో విస్తృత భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు.

బహిష్టు పరిశుభ్రత ప్రాథమిక హక్కు

మొదటిపేజీ తరువాయి..

ప్రశ్నించింది. తదుపరి విచారణ నాటికి కూడా స్పందించకపోతే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 13న ఈ అంశంపై విచారించింది. బహిష్టు ఆరోగ్యానికి సంబంధించిన ప్రాథమిక హక్కు తీర్పు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 జీవించే హక్కు వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుందని ధర్మాసనం గుర్తుచేసింది. రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్యం కూడా ఈ హక్కులో భాగమని సుప్రీం కోర్టు ఇప్పటికే ప్రకటించిందని తెలిపింది. సెప్టెంబర్ 1న ఇచ్చిన ఆదేశాల్లో తీర్పులో ప్రస్తావించిన లోపాల్ని పరిశీలించి, వాటిపై తీసుకున్న చర్యల వివరాల్ని తదుపరి విచారణకు సమర్పించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించినట్లు బెంచ్ గుర్తుచేసింది. అయినా కేంద్రం కోరిన సమాచారం ఇవ్వకపోవడంపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు తీర్పులో చెప్పిన అంశాలు కేవలం కాగితాలపైనే ఉంటే, ఈ ప్రాథమిక హక్కును కేంద్రం, రాష్ట్రాలు ఎలా అమలు చేస్తాయని ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి- ఈ అంశాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోందని, తీర్పు

అమలు తీరుపై వివరాలు ఇవ్వాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్ని కోరినట్టు తెలిపారు. అయితే ఇప్పటివరకు స్పందన రాలేదని ఆమె కోర్టుకు వివరించారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం- కేంద్రం కోరినా రాష్ట్రాలు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ తీర్పు ప్రాముఖ్యతను గుర్తించాయని భావిస్తున్నట్లు తెలిపిన ధర్మాసనం- ఆయా రాష్ట్రాలు తీసుకున్న చర్యలకు లిఖితపూర్వక వివరాలు సేకరించాలని కేంద్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ సమయంలోనూ కొన్ని రాష్ట్రాలైనా స్పందించకపోతే కేంద్రం చెబితే, సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. విచారణారంభం సందర్భంగా ఇష్యూ కేసు విచారణను డిసెంబర్ 14 కు వాయిదా వేసింది.'మేం తీర్పులో చెప్పిన విషయాలు కేవలం కాగితాలకే పరిమితమైతే, కేంద్రం, రాష్ట్రాలు ఈ ప్రాథమిక హక్కును చిన్నారి బాలికలకు ఎలా అందిస్తాయి? సుదూర ప్రాంతాల్లో రుతుస్రావ పరిశుభ్రత సదుపాయాలు లేక చదువుకు దూరమవుతున్న వేలాది మంది బాలికల సంక్షేమం కోసం ఈ తీర్పు ఇచ్చామని గుర్తించాలి.' అని సుప్రీంకోర్టు తెలిపింది.

ఆర్మీ మేజర్ భార్య ఏఐతో గూఢచర్యం!

భద్రతకు ముప్పు కలిగించేలా విశ్లేషణాత్మక పరిశోధనా పత్రాల ముసుగులో ఆమె గూఢచర్యానికి పాల్పడుతున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ క్రమంలో ఆమెను అదుపులోకి తీసుకుని విచారించామని, అనంతరం అరెస్టు చేసినట్లు సమాచారం అందుబాటులో పోలీసు వర్గాలు వెల్లడించాయి. కేంద్ర నిఘా వర్గాల నుంచి అందిన పక్కా సమాచారం ఆధారంగా, ఈ నెల 14న ఆమె పఠాన్‌కోట్ వెళ్లేందుకు జమ్మూతావి రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే భద్రతా దళాలు ఆమెను అదుపులోకి తీసుకున్నాయి. వెంటనే ఆమెను సమీపంలోని సైనిక స్థావరానికి తరలించి విచారించారు. ఆమె వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌తో పాటు ఇతర డిజిటల్ పరికరాలను అధికారులు స్వాధీనం చేసుకుని, ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ప్రస్తుతం గాంధీ నగర్ పోలీస్ స్టేషన్‌లో అధికార రహస్యాల చట్టం కింద పాటు భారతీయ న్యాయ సంహిత లోని గూఢచర్యం, నేరపూరిత కుట్ర, దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించే సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ హైప్రొఫైల్ కేసు సమగ్ర విచారణ బాధ్యతలను డీఎస్పీ స్థాయి అధికారికి అప్పగించారు. ఆమె మొబైల్ ఫోన్‌ను ప్రాథమికంగా పరిశీలించగా విస్మయపరిచే అంశాలు వెలుగులోకి వచ్చాయి. భారత్-ఇజ్రాయెల్ రక్షణ సంబంధాలపై మాణెక్ షా సెంటర్‌లో జరిగిన సమావేశ వివరాలు, భారత సైన్యాధిపతి అమెరికా పర్యటన కార్యక్రమం, భారత్-రష్యా రక్షణ ఒప్పందాలు, సైనిక వ్యూహమైన 'కోల్డ్ స్టార్ట్ డాక్ట్రిన్' పత్రాలు ఆమె వద్ద లభించాయి. అంతేకాకుండా అరుణాచల్ ప్రదేశ్‌లోని వ్యూహాత్మక కల్లె-2 హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు, కమలా ప్రాజెక్టులతో పాటు అస్సాం ప్రాజెక్టులు, భారత్-చైనా సరిహద్దు సంబంధాలపై ఉన్న క్లిష్టమైన సమాచారం ఆమె ఫోన్‌లో నిక్షిప్తమై ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నిందితురాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో ఉన్నత విద్యావంతురాలు. 2021లో బెంగళూరు యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ, 2022లో జేఎన్‌యూ మాస్టర్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ పూర్తి చేశారు. ఢిల్లీలోని సెంటర్ ఫర్ ల్యాండ్ వార్‌ఫేర్ స్టడీస్‌లో ఇంటర్న్‌షిప్ చేయడంతో పాటు పలు వ్యాసాలు రాశారు. 2023లో ఐక్యరాజ్యసమితి (ఐరాస) లో ఐటీ ఇంటర్న్‌షిప్ చేసిన సమయంలో చైనా జాతీయులతో సహా పలువురు విదేశీయులతో ఆమె వాట్సాప్ సంభాషణలు జరిపినట్లు వెల్లడైంది. 2024లో మలేసియాలో కన్సల్టెన్సీ నడుపుతున్న కొందరు వ్యక్తులతోనూ ఆమె నిరంతర సంప్రదింపులు జరిపారని, ఆ వ్యక్తులు చైనా నిఘా విభాగాలకు అనుబంధంగా పనిచేస్తున్నారని దర్యాప్తులో బయటపడింది.విచారణలో తాను చాట్‌జీపీటీ, ఓపెన్ఏఐ, ఆంత్రోపిక్ వంటి బహిరంగ ఏఐ టూల్స్ ద్వారా లభించే సమాచారాన్ని సేకరించి చెప్పినప్పటికీ, బహిరంగ డేటాతో పాటు అంతర్గత సైనిక సమాచారాన్ని జోడించి విశ్లేషణ పత్రాలు రూపొందించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఫ్రీలాన్స్ రీసెర్చర్ ముసుగులో ఆమె ద్వారా ఎంత మొత్తం సమాచారం శత్రుదేశాలకు చేరిందో వెల్లడైంది? ఆమె జరిపిన ఆర్థిక లావాదేవీలు ఏమిటి? అన్న కోణాల్లో అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

కడ్తాల్‌లో ఘనంగా గంగనీళ్ల జాతర..

సోన్, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో ఆదివారం గంగనీళ్ల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం దేగాం గ్రామానికి చెందిన పోచమ్మ తల్లి ఆభరణాలకు శనివారం సాయంత్రం గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం తెల్లవారుజామున సోన్ మండలంలోని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మవారి ఆభరణాలను శుద్ధి చేశారు. అనంతరం ఆభరణాలు, గంగాజలాలతో పాదయాత్రగా గ్రామానికి తీసుకువచ్చారు. మహిళలు మంగళహారతులు బాజాభజంత్రీలతో గ్రామ పురవీధుల గుండా ఆభరణాల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పిల్లాపాపలను చల్లగా చూడాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ వీడీసీ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రం రాము, వీడీసీ చైర్మన్ గుర్రం గంగన్న తదితరులు పాల్గొన్నారు.

బోరిగాం రోడ్డుపై తొలగిన ప్రమాదాల ముప్పు!

ముళ్లపొదలు తొలగింపుతో వాహనదారులకు ఊరట



నేరడిగొండ అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : మండలం బోరిగాం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, దట్టమైన ముళ్లపొదలను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో గురువారం తొలగించారు. ఈ పనులను సర్పంచ్ రాథోడ్ వినేష్ దగ్గరుండి పర్యవేక్షించారు. రహదారికి ఇరువైపులా పొదలు విపరీతంగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా మలుపుల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు ఈ ముళ్లపొదలను తొలగించడంతో రోడ్డుపై స్పష్టమైన వీక్షణ పెరిగి, ఎదురుగా వచ్చే వాహనాలు ముందే కనిపించనున్నాయి. దీనివల్ల ఢీకొనే ప్రమాదాలు తగ్గి, ప్రయాణం సురక్షితంగా మారనుంది.

అటు వాహనదారుల భద్రత పెరగడంతో పాటు రోడ్డు పరిసరాలు శుభ్రపడటం పట్ల గ్రామస్థులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చవాన్ సంగీత్ పండిత్, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక యువకులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి కథనానికి స్పందన..

గుంతలు పూడ్చిన మెగవెల్లి, ఇప్పలగూడ యువకులు....

బెజ్జూర్ 18 అక్టోబర్ (ప్రజాజ్యోతి) : ప్రజాజ్యోతి పత్రికలో రోడ్డుపై గుంతల మాయం. అనే శీర్షికతో వెలువడిన వార్తకు స్పందించిన మెగవెల్లి, ఇప్పలగూడ గ్రామాలకు చెందిన యువకులు స్వచ్ఛందంగా ముందు కొచ్చి రోడ్డుపై ఏర్పడిన గుంతలను మొరం వేసి పూడ్చారు. దీంతో రహదారిపై రాకపోకలు మెరుగుపడటంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ యువకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రహదారి మహారాష్ట్రకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా కూరగాయల వ్యాపారులు, చిరు వ్యాపారులు, ఇతర ప్రయాణికులు ఈ రహదారిపై నిత్యం ప్రయాణిస్తుంటారు. రోడ్డుపై గుంతల కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, పత్రికలో వచ్చిన కథనానికి స్పందించి యువకులు స్వచ్ఛందంగా గుంతలను పూడ్చడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారం దిశగా అడుగులు వేసిన యువకుల సేవాభావాన్ని పలువురు ప్రశంసించారు. రానున్న రోజుల్లో కూడా యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని గ్రామాల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాజ్యోతి కథనం స్ఫూర్తిగా నిలవడం, యువత స్వచ్ఛందంగా ముందుకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ధమ్మచక్ర పరివర్తన దినోత్సవానికి పిలుపు

- 29న లుంబిని దీక్షాభూమిలో వేడుకలు
- పాంప్లెట్ విడుదల చేసిన దుర్గం ప్రశాంత్
- హాజరుకానున్న రెంజర్ల రాజేష్

ఆసిఫాబాద్ అక్టోబర్ 18 ప్రజాజ్యోతి : జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్షాభూమిలో ఈ నెల 29న నిర్వహించనున్న 70వ అశోక ధమ్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సెంటర్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రశాంత్ కోరారు. ఈ సందర్భంగా రాజ్యాంగ రక్షణా దళ్ ఫౌండర్ రెంజర్ల రాజేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వేడుకలకు ఆహ్వానించారు. కార్యక్రమానికి సంబంధించిన పాంప్లెట్‌ను ఆయన చేతుల మీదుగా విడుదల చేశారు.

ధమ్మచక్ర పరివర్తన దినోత్సవ ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనతో పాటు రాజ్యాంగ పరిరక్షణ, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 29న జరిగే వేడుకలకు రెంజర్ల రాజేష్ హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ధమ్మ బాంధవులు, బౌద్ధ ఉపాసకులు, అంబేద్కర్‌వాదులు, యువత, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బోథ్ ఎక్స్ రోడ్డుకు అభివృద్ధి వెలుగులు!

సులభ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ

నేరడిగొండ అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : బోథ్ ఎక్స్ రోడ్డు జంక్షన్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం బోత్ ఎక్స్ రోడ్డు వద్ద నూతనంగా నిర్మించనున్న సులభ కాంప్లెక్స్‌కు ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి భూమిపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోత్ ఎక్స్ రోడ్డు ప్రధాన కూడలి కావడంతో చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రయాణికులు ఇక్కడికి వస్తుంటారని తెలిపారు. అయితే, కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, వారి అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో సులభ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే ప్రయాణికులతో పాటు వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

హామీ మేరకు హైమాస్ట్ లైట్ల పనులు ప్రారంభం : బోత్ ఎక్స్ రోడ్డు వద్ద రాత్రి వేళల్లో తగినంత వెలుతురు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఇటీవల తన దృష్టికి తీసుకురాగా, 48 గంటల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు.

ఆ హామీ మేరకు లైట్ల ఏర్పాటుకు సంబంధించిన పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బోత్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు స్వామి, నాయకులు శ్రీధర్ రెడ్డి, గులాబ్, రూప్‌చంద్, సుజిల్, రాంచందర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేవాభావంతో వైద్య వృత్తిలో రాణించాలి

ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన 30 మంది ముస్లిం విద్యార్థులకు ఘన సన్మానం

నిర్మల్ టౌన్. అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకొని సమాజానికి అంకితభావంతో సేవలందించాలని ముఫ్తీ ఇలియాస్ ఖాస్మి పిలుపునిచ్చారు. తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిధిలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన 30 మంది ముస్లిం విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జున్ అలీ మాట్లాడుతూ, విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

దైవం తర్వాత వైద్యులకు సమాజంలో ఎంతో గౌరవం ఉంటుందని పేర్కొంటూ, వైద్య వృత్తిని ఎంచుకున్న విద్యార్థులు సేవనే పరమావధిగా భావించి ముందుకు సాగాలని అన్నారు.

ఎంబీబీఎస్ డిగ్రీతోనే ఆగిపోకుండా, పీజీ విద్యలోనూ ఉన్నత స్థానాలు సాధించి, తమ రంగంలో నిష్ణాతులైన వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ ప్రతిభతో తల్లిదండ్రులకు, స్వగ్రామాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఏ. మతీన్, వహీద్ ఖాన్‌తో పాటు మొహమ్మద్ ఇంతియాజ్, అబ్దుల్ సాజిద్, ముజాహిద్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కలమడుగు శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 8 మంది అరెస్ట్ - రూ.42,040 నగదు, 8 ఫోన్లు, 3 బైక్‌లు స్వాధీనం

జన్నారం, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. జన్నారం పోలీస్ స్టేషన్ పరిధి కలమడుగు గ్రామ శివారులో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో శనివారం రాత్రి నార్కోటిక్ టీమ్ / టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐ దీకొండ రమేష్, లచ్చన్న, ఆర్ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మరియు సిబ్బంది ఆకస్మిక దాడి నిర్వహించారు.

ఈ దాడిలో పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.42,040 నగదు, 8 మొబైల్ ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో రేవోజిపేటకు చెందిన ఎనుగుల శేఖర్, ఎల్.సుధాకర్, గోత్రాల రమేష్, కలమడుగు గ్రామానికి చెందిన గారెపల్లి సాగర్ గౌడ్, శ్రీరాముల రాజేశం, జక్కుల తిరుపతి, తక్కళ్లపల్లి శ్రీనివాస్, నేరెళ్ల రాజు లను అదుపులోకి తీసుకున్నామని, నిందితులను మరియు స్వాధీనం చేసుకున్న నగదు, ఫోన్లు, వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం జన్నారం పోలీస్ స్టేషన్ ఎస్.ఐ ఉదయ్ కిరణ్‌కు అప్పగించినట్లు తెలిపారు.

జర్నలిస్టుల హక్కుల కోసం రాజీలేని పోరాటం

- మూడోసారి టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ రహమాన్
- జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తా

ఆసిఫాబాద్, అక్టోబర్ 18 ప్రజాజ్యోతి : జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటం సాగిస్తానని స్పష్టం చేశారు. జిల్లా మూడో మహాసభలో వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనకు ఆదివారం జిల్లా కేంద్రంలోని టీయూడబ్ల్యూజే కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఫెడరేషన్ ప్రతినిధులు అబ్దుల్ రహమాన్‌కు పూలమాలలు వేసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా మూడోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషకరమన్నారు.

అనంతరం టీయూడబ్ల్యూజేఎఫ్ నూతన అధ్యక్షుడు మాజీద్ ఇక్బాల్, కార్యదర్శి నసిర్ ఖాన్‌లను అబ్దుల్ రహమాన్ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ముష్ఫఖం అహ్మద్, వసీ ఖాన్, అజర్ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవ నిర్వహణలో నిర్లక్ష్యం

- ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కార్యక్రమాలు చేపట్టాలి - కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్ డిమాండ్

ఆసిఫాబాద్ అక్టోబర్ 18 ప్రజా జ్యోతి : పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించి, ప్రజలకు రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్ డిమాండ్ చేశారు. ప్రతి నెల చివరి వారంలో నిర్వహించాల్సిన ఈ కార్యక్రమాలను కొన్ని గ్రామాల్లో మొక్కుబడిగా చేపడుతున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పౌర హక్కుల దినోత్సవానికి ఎస్ఐ, తహసీల్దార్ స్థాయి అధికారులు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో కింది స్థాయి సిబ్బందితోనే కార్యక్రమాలను ముగిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కార్యక్రమాల లక్ష్యం నెరవేరడం లేదని అభిప్రాయపడ్డారు. కార్యక్రమాలు నిర్వహించినట్లు నమోదు చేయడానికే పరిమితం కాకుండా, ప్రజలకు తమ హక్కులు, వాటి పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పౌర హక్కులపై చైతన్యం కల్పించడం సంబంధిత అధికారుల బాధ్యత అని దినకర్ పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రతి నెలా పౌర హక్కుల దినోత్సవాన్ని సమర్థంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో కార్యక్రమాలు చేపట్టి, వాటి ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని డిమాండ్ చేశారు.

పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కార్యవర్గంలో నేరడిగొండ ఉపాధ్యాయులకు కీలక బాధ్యతలు

నేరడిగొండ, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : నల్లగొండ జిల్లాలో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో నేరడిగొండ మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి కీలక పదవులు లభించాయి. మండల ఉపాధ్యాయులు జాదవ్ సుభాష్, సి. జగదీష్ రెడ్డి, జి. ఆనంద్ బాబుతో పాటు ఎ. అంబారావు, జె. ధన్‌రాజ్, ఎ. చంద్రశేఖర్, డి. భాగ్యలక్ష్మి, షహీన్ కౌసర్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర కార్యదర్శులుగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నేరడిగొండ మండల పీఆర్టీయూ నాయకులు మండల అధ్యక్షుడు బిక్కులాల్, ప్రధాన కార్యదర్శి జాదవ్ తానాజీ నూతనంగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు సంఘ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణతో పాటు సంఘ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా దుర్గాదేవి బోనాల పండుగ

నేరడిగొండ, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : మండలంలోని కుమారి గ్రామంలో గాయత్రీ మాత దుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి బోనాల పండుగను అశేష జనవాహిని మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు.

గ్రామ మహిళలు, ఆడబిడ్డలు, భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకొని వీధివాడల గుండా ఘనంగా ఊరేగింపుగా వెళ్లారు. గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి, గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల శివసత్తుల విన్యాసాలు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు.

సోనాల ప్రజలను బెంబేలెత్తిస్తున్న కొండముచ్చు

సోనాల, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : సోనాల మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా భయాందోళనలో గ్రామస్థులు. గత కొద్ది రోజులుగా ఒక కొండముచ్చు సంచరిస్తూ స్థానికులను హడలెత్తిస్తోంది. పగటిపూటే జనావాసాల మధ్య తిరుగుతూ, ఇళ్లపైకి ఎక్కుతుండటంతో గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. దీని బారిన పడి ఎందరో ద్విచక్ర వాహనదారులు గాయాలపాలయ్యారు. ఇకనైనా అటవీ శాఖ వారు ఈ కొండముచ్చు ను బంధించి తరలించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

పాలపిట్ట సంరక్షణ పోస్టర్ల ఆవిష్కరణ

జన్నారం, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పక్షి పాలపిట్ట సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గాను రూపొందించిన పోస్టర్లను ఆదివారం రోజున మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో ఎఫ్డిఓ రామ్మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల నరికివేత, వ్యవసాయ పంటల్లో పురుగు మందులు అధికంగా వాడడం వలన పాలపిట్టల సంఖ్య క్షీణించి పోతుందని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పాలపిట్ట ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, వ్యవసాయ పంటలకు హాని చేసే కీటకాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని అన్నారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం పాలపిట్టను బంధించిన, వధించిన, ప్రదర్శించిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జన్నారం, తాళ్లపేట రేంజ్ అధికారులు బాబా ఖాదర్ వలీ, జి. వికాస్, డిఆర్ఓ మమత, ఇంధనపెల్లి ఎఫ్ఎస్ఓ శేషారాం, బీట్ అధికారులు రవి నాయక్, రహీముద్దీన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిలో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

– కాంగ్రెస్ గూటికి గ్రామస్థాయి నేతలు – మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు చేరిక

వనపర్తి, అక్టోబరు 18 (ప్రజాజ్యోతి): వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా చేరికలు కొనసాగుతున్నాయి.

వనపర్తి మండలం వెంకటాపురం, కందిరీగ తండా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వనపర్తి పట్టణంలోని నందిహిల్స్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

వెంకటాపురంలో 122 మంది కాంగ్రెస్‌లో చేరిక

వెంకటాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, వెంకటయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మద్దిలేటి భార్య శారద, బక్కమ్మ, వార్డు సభ్యులు శ్రీను, జయమ్మ తదితరులతో కలిపి మొత్తం 122 మంది కాంగ్రెస్‌లో చేరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తామని, వారి అభివృద్ధికి పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధి లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

కందిరీగ తండాలో 150 మందికి పైగా చేరిక

వనపర్తి మండలం కందిరీగ తండాకు చెందిన బీజేపీ సర్పంచ్ రాజు నాయక్, ఉపసర్పంచ్ సరోజ, హీరా సింగ్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు, గ్రామానికి చెందిన సుమారు 150 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువతకు తగిన గుర్తింపు, సముచిత గౌరవం కల్పిస్తామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మాజీ సర్పంచులు రాములు, మురళి, గ్రామ పెద్దలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంతిపూల సాగు రైతుకు నిరంజన్‌రెడ్డి ప్రశంసలు

మర్రికుంటలో రైతు శాంతన్న తోట సందర్శన..
దసరా, దీపావళికి పూల ఆర్డర్

వనపర్తి, అక్టోబరు 18 (ప్రజాజ్యోతి): పట్టణంలోని మర్రికుంటలో రైతు శాంతన్న సాగు చేసిన బంతిపూల తోటను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బంతిపూల సాగు విధానాన్ని, ఏపుగా పెరిగిన పంటను పరిశీలించి రైతు శాంతన్నను అభినందించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు కాలానుగుణంగా డిమాండ్ ఉన్న పంటలను సాగు

చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. దసరా, దీపావళి పండుగల సమయంలో బంతిపూలకు అధిక డిమాండ్ ఉంటుందని తెలిపారు. పూల కోసం దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం కంటే స్థానిక రైతులు సాగు చేసిన పూలు అందుబాటులో ఉండటం ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. స్థానికంగా పూల సాగును ప్రోత్సహించడం వల్ల రైతులకు ఆదాయం లభించడంతోపాటు ప్రజలకు నాణ్యమైన పూలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రైతు శాంతన్న సాగు చేసిన బంతిపూల తోటను ప్రోత్సహించే ఉద్దేశంతో దసరా, దీపావళి పండుగల కోసం పూలకు స్వయంగా ఆర్డర్ ఇచ్చినట్లు నిరంజన్‌రెడ్డి తెలిపారు. స్థానిక రైతుల కృషికి ప్రోత్సాహం అందించడం అవసరమని పేర్కొన్నారు. నిరంజన్‌రెడ్డి వెంట వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, మాధవరెడ్డి, సునీల్ వాల్మీకి, మంద రాము, ఎండీ అలీం, ముద్ద సిర్, జమీల్, చీర్ల శ్రీనివాసులు, బెదారి కుమార్, శంకర్ నాయక్, కృష్ణ నాయక్ తదితరులు ఉన్నారు.

యువతలో క్రీడా స్ఫూర్తికి 'వివేకానంద క్రికెట్ టోర్నీ'

సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా సీజన్–1 పోటీలు ప్రారంభం

వనపర్తి, అక్టోబరు 18 (ప్రజాజ్యోతి): సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు, స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా యువతను చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా వనపర్తి జిల్లా కేంద్రంలో 'వివేకానంద క్రికెట్ టోర్నమెంట్ సీజన్–1' ప్రారంభమైంది. హిందూ వాహిని ఆధ్వర్యంలో, బీజేపీ నాయకుల సహకారంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని ఛత్రపతి శివాజీ ప్రాంగణంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తు

న్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం, సేవా సంకల్పానికి గుర్తుగా చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవానికి వనపర్తి జిల్లా బీజేపీ అధ్యక్షుడు డి. నారాయణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, కేతురి బుడ్డన్న, జిల్లా అధికార ప్రతినిధి గజరాజుల తిరుమలేశ్, సామాజిక సేవా కార్యకర్త గంధం నాగరాజు, హిందూ వాహిని జిల్లా కన్వీనర్ అరుణ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు బోలమోని మణి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు టోర్నమెంట్‌ను ప్రారంభించి క్రీడాకారులను ప్రోత్సహించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు, ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు ఇటువంటి టోర్నమెంట్లు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో హిందూ వాహిని ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువ క్రీడాకారులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎస్టీయూ

నాగర్ కర్నూల్ అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి బ్యూరో): ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ

నివేదికను తెప్పించడంతో పాటు, హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని భవనంలో ఎస్టీయూ ప్రత్యేక కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఏఐఎస్‌టీఎఫ్ ఆడిటర్ ఎం. పర్వత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్టీయూ 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో నిర్వహించే వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపుని చ్చారు. ఇటీవల ఇండోనేషియా రాజధాని జకార్తాలో 40 దేశాల ప్రతినిధులు పాల్గొన్న అంతర్జాతీయ విద్యా సదస్సులో పాల్గొని తిరిగి వచ్చిన ఎం. పర్వత్ రెడ్డిని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్టీయూ శాఖ ఘనంగా సన్మానించింది.ఎస్టీయూ 80 సంవత్సరాల ఉత్సవాలను నవంబర్ 14న ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి ఎస్. మధుసూదన్ రెడ్డి ప్రకటించారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు కె. రమేష్, డి. ప్రభాకర్, కె. రఘురాం రెడ్డి, జిల్లా నాయకులు కర్ణాకర్ రెడ్డి, సత్యనారాయణ, బాలస్వామి, హనుమంత రెడ్డి, జమీల్ అహ్మద్, మురళి, ప్రవీణ్ కుమార్, నరసింహ, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్, మండల బాధ్యులు శివశంకర్, హుస్సేన్, నారాయణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల బస్సు పాసులను హైదరాబాద్కు విస్తరించాలి

బ్రహ్మగిరి, మన్ననూర్ ప్రెస్ సెంటర్లలో అర్హులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి

ప్రెస్ కౌన్సిల్‌లో యూనియన్‌కు ముగ్గురికి అవకాశం రావడం గర్వకారణం

టీయూడబ్ల్యూజే హెచ్–143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్

నాగర్ కర్నూల్ అక్టోబర్ 18(ప్రజా జ్యోతి బ్యూరో) రాష్ట్రంలోని జర్నలిస్టుల ఆరోగ్య కార్డులను పునరుద్ధరించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల పరిధిలో కొనసాగుతున్న జర్నలిస్టుల బస్సు పాసులను హైదరాబాద్ వరకు విస్తరించాలని టీయూడబ్ల్యూజే హెచ్–143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని బ్రహ్మగిరి, మన్ననూర్ సెంటర్లలో

పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం మన్ననూర్‌లో స్థానిక జర్నలిస్టులతో సమావేశమైన మారుతిసాగర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు చందునాయక్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రావూఫ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే హెచ్–143 నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ఉద్యమాలు చేపడుతూ వారికి అండగా నిలుస్తు న్నామని పేర్కొన్నారు. ప్రెస్ కౌన్సిల్‌లో తమ యూనియన్‌కు అనుబంధంగా ఉన్న ఐజేయూ నుంచి ముగ్గురికి అవకాశం లభించడం గర్వకారణమన్నారు. ప్రస్తుతం జర్నలిస్టులకు ఉమ్మడి జిల్లాల పరిధిలో కొనసాగుతున్న బస్సు పాసులను హైదరాబాద్ వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామీణ ప్రాంత జర్నలిస్టులు అధికారిక సమావేశాలు, విధుల నిర్వహణ, వైద్య అవసరాల కోసం రాజధానికి వెళ్లాల్సి వస్తోందని వివరించారు. బస్సు పాసుల పరిధిని హైదరాబాద్ వరకు పెంచితే జర్నలిస్టులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ఈ సమస్యను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అమ్రాబాద్ మండలంలోని బ్రహ్మగిరి, మన్ననూర్ సెంటర్లలో గతంలో అక్రిడిటేషన్లు కొనసాగాయని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త జీవో ప్రకారం కొన్ని పత్రికలకు అక్రిడిటేషన్లు మంజూరైనప్పటికీ, అర్హత ఉండి పనిచేస్తున్న మరో ముగ్గురు జర్నలిస్టులకు కార్డులు అందక పోవడం అన్యాయమని అన్నారు. ఈ రెండు సెంటర్లలో అర్హులైన ముగ్గురు జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేసేలా సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రిడిటేషన్లు అందని అర్హులైన...జర్నలిస్టులందరికీ కార్డులు మంజూరయ్యే వరకు యూనియన్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. మండల కేంద్రాలు, పట్టణాల్లో పనిచేస్తున్న అర్హులైనజర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్క జర్నలిస్టుకు అన్యాయం జరగకుండా యూనియన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన జర్నలిస్టు సంఘంగా అదే స్ఫూర్తితో జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరంపోరాడుతున్నామని, ఆ క్రమంలో అనేక సమస్యలను పరిష్కరించుకోగలిగామని వివరించారు. నల్లమల ప్రాంతంతో తనకు ఎంతో అనుబంధం ఉందని పేర్కొంటూ, జిల్లాలో యూనియన్ సభ్యత్వాల నమోదును ఈ నెలాఖరులోగా పూర్తి చేసి రాష్ట్ర కమిటీకి పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక జర్నలిస్టు యూనియన్ నాయకులు ప్రకాష్, కర్నాటి శ్రీనివాసులు, బుచ్చయ్య, వేదాంతం, బిచ్యా, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్ లో వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

సద్దుల బతుకమ్మ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు
మక్తల్ బతుకమ్మ ఉత్సవాల కమిటీ చైర్మన్ గా వాకిటి లలితమ్మ

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి,అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి): తెలంగాణ ఆడపడుచులు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగలో తొమ్మిదో రోజు చివరి రోజు సద్దుల

బతుకమ్మ వేడుకలను ఆదివారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలోని రాంలీలా మైదానంలో రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య క్రీడల యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. సద్దుల బతుకమ్మ వేడుక సందర్భంగా మహిళలు కొత్త బట్టలు ధరించి తంగేడు,గునుగు, బంతి,చామంతి, పద్మాలు వంటి తీరొక్క పూలతో పెద్ద శిఖరంలా అలంకరించిన బతుకమ్మలకు మంత్రి సతీమణి వాకిటి లలితమ్మ మహిళలతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మతో పాటు మున్సిపల్ చైర్పర్సన్ వాకిటి మానస హనుమంతు, ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి,వైస్ చైర్మన్ మహిళా కౌన్సిలర్లతో పాటు మహిళా సంఘాల సభ్యులు, చిన్నారులు కలిసి బతుకమ్మల చుట్టూ కోలాటాలు ఆడుతూ ఆడబి డ్డలంతా సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, ఒకచోట చేరి బతుకమ్మ ఆటలతో పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా పువ్వులను దైవంగా భావించే సంప్రదాయం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే జరుపుకోవడం మనకు గర్వకారణం అని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి , గౌరమ్మకి ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలంతా బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా గత సంవత్సరం నుండి మక్తల్ పట్టణ కేంద్రంలో ఆడపడుచు లంతా బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రకృతిని ఆరాధించడం,పూల ప్రాముఖ్యతను చాటిచెప్పడం ఈ పండుగ ప్రత్యేకత తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,ఐక్యతకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, అస్తిత్వాన్ని ప్రతిబింబిస్తూ తరతరాలుగా కొనసాగుతున్న విశిష్టమైన పూల పండుగను మన మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో మహిళ లందరూ గౌరమ్మకు పూజలు చేసి సద్దుల బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం జరిగింది అన్నారు. అనంతరం మక్తల్ నియోజకవర్గ బతుకమ్మ ఉత్సవాల కమిటీ చైర్మన్ గా నియమించిన వాకిటి లలితమ్మను మంత్రి వాకిటి శ్రీహరి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ, సంబంధిత అధికారులు,మక్తల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల మహిళా సంఘాల సభ్యులు,మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు మహిళలు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర స్వామి దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనం

అశ్వ వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగిన వెంకటేశ్వరుడు

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి,అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి): మక్తల్ పట్టణంలోని బ్రాహ్మణవాడలో వెలిసిన అతి పురాతనమైన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి 61వ వార్షిక బ్రహ్మోత్సవాలలో ఆదివారం అశ్వవాహనం శ్రీనివాసుడు ఆలయ పురవీధుల గుండా ఊరేగారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ధర్మకర్త శ్యాంసుందర్ జోషి ఆధ్వర్యంలో ఆరవ రోజు ఆలయ అర్చకులు వంశి జోషి తెల వారుజామున స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో 8వ రోజు దుర్గాష్టమి సందర్భంగా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామివారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు గోవింద నామాలు స్మరిస్తూ మేళతాళాల మధ్య అశ్వవాహనంపై స్వామివారిని ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక మహా మంగళహారతి ఇవ్వడం జరిగింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా కలియుగ కల్పతరువైన ఆ వేంకటేశ్వర స్వామి ముందు చిన్నారులచే నిర్వహించిన నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. భక్తులు స్వామివారిని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త శ్యాంసుందర్ జోషి మాట్లాడుతూ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి 61వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈరోజు సాయంత్రం 6 గంటలకు స్థానిక శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయం నుండి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి పెళ్లి కుమారుడిగా గజవాహనంపై పట్టణ పురవీధుల గుండా ఆలయం వరకు ఊరేగింపుగా చేరుకుంటారు. కావున మక్తల్ పట్టణవాసులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు. ఇట్టి కార్యక్రమంలో డి.వి. చారి ,కరణం గోవిందరావు,వాదిరాజు,హన్మేష్ చారి, గోపాల చారి,కృష్ణ చారి, కౌశిక్ చారి బ్రాహ్మణులు,మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిషాసుర మర్దిని అలంకారంలో శ్రీ రాజరాజేశ్వరి దేవి

గద్వాల అక్టోబర్ 18(ప్రజా జ్యోతి ప్రతినిధి): దసరా శరన్నవరాత్రుల సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల పట్టణ రాజవీధిలో ఉన్న శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఎనిమిదో రోజు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ రాజరాజే శ్వరి దేవి అమ్మవారిని మహిషాసుర మర్దిని అలంకారంలో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే అమ్మవారి దివ్యరూపాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.దీంతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

మహిషాసుర మర్దిని రూపం వెనుక పురాణగాథ:

హిందూ పురాణాల ప్రకారం మహిషాసురుడు అనే రాక్షసుడు తన శక్తితో దేవతలను, లోకాలను ఇబ్బందులకు గురిచేశాడు.అతడి దురహంకారాన్ని, దుష్టశక్తిని అణచివేసేందుకు దేవతలందరి తేజస్సుతో ఆదిపరాశక్తి దుర్గాదేవి అవతరించినట్లు పురాణాలు వివరిస్తాయి.దేవ తలు సమర్పించిన దివ్యాయుధాలను ధరించిన అమ్మవారు మహిషాసు రుడితో భీకర యుద్ధం చేసి చివరకు అతడిని సంహరించింది. మహిషా సురుడిని సంహరించిన దేవిగా అమ్మవారికి 'మహిషాసుర మర్దిని'అనే పేరు ప్రసిద్ధి చెందింది.ఈ రూపం చెడుపై మంచి,అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుంది.

మహిళల కుంకుమార్చనలు.. బతుకమ్మ ఆటపాటలు:

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పద్మశాలి మహిళలు అమ్మవారికి భక్తిశ్ర ద్ధలతో కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.అనం తరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.పూలతో అందంగా పేర్చిన బతుక మ్మలతో మహిళలు ఆలయ ప్రాంగణంలో సంప్రదాయ పాటలు పాడుతూ,ఆటలాడుతూ సందడి చేశారు.భక్తి, ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పడంతో పాటు మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

ధర్మ విజయానికి ప్రతీక అమ్మవారి అలంకారం:

మహిషాసుర మర్దిని రూపం స్త్రీశక్తి, ధైర్యం,పరాక్రమం,ధర్మ పరిరక్షణకు ప్రతీకగా భక్తులు భావిస్తారు.ఎన్ని ఆటంకాలు ఎదురైనా సత్యం, న్యాయం, ధర్మం చివరకు విజయం సాధిస్తాయనే సందేశాన్ని అమ్మవారి అవతారం చాటిచెబుతుందని పేర్కొన్నారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరికీ సుఖశాంతులు,ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని,ప్రతి ఇంటా సంతోషం,శాంతిసౌభాగ్యాలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు.

రెండు దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు..

- మహిళా మున్సిపల్ సిబ్బందికి చీరల పంపిణీ..
- డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్..

పరకాల అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల పట్టణ ప్రముఖ వైద్యుడు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ ఆదివారం మున్సిపల్ మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. గత 20 ఏళ్లుగా ప్రతి పండుగ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేస్తూ తన వంతు సహకారం అందిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ సిబ్బంది సేవలు అభినందనీయమని అన్నారు. ప్రజలకు నిరంతరం సేవలందించే సిబ్బందికి తన వంతుగా సహాయం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. మున్సిపల్ సిబ్బందికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురైనా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు గాజుల నిరంజన్‌తో పాటు బీజేపీ నాయకులు మిడిదొడ్డి నరేష్, ఆకుల శ్రీధర్, ముత్యాల దేవేందర్, సాదా మధుకర్, పిట్ట కిషోర్, మెంతుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో ఘనంగా బతుకమ్మ విగ్రహ ఆవిష్కరణ

- సర్పంచ్ సేవాభావం అభినందనీయం:ఎస్సై వంశీకృష్ణ

సంగెం, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో బతుకమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామ సర్పంచ్ వేల్పుల రాజు - సునీత దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, విగ్రహాన్ని ఆవిష్కరించారు.

సర్పంచ్ వేల్పుల రాజు తన తండ్రి కుమారుడు (దివంగత) వేల్పుల ఐలయ్య. తన కుమారుడు బన్నీ జ్ఞాపకార్థం గ్రామానికి ఈ బతుకమ్మ విగ్రహాన్ని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ విగ్రహాన్ని గ్రామానికి విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం సమాజానికి ఉపయోగపడేలా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, కొత్తగా ఆవిష్కరించిన విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెంకటాపురంలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

సంగెం, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగను వెంకటాపురం గ్రామంలో అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరికీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ ఉత్సవాల్లో సర్పంచ్ తాళ్ళపెల్లి శ్రీనివాస్ గౌడ్, పాల్గొని వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రకృతిని పూజించే విశిష్టమైన పండుగ బతుకమ్మ అని, గ్రామంలో అందరూ కలిసిమెలిసి పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు న్యాల అశోక్ యాదవ్ ఇత్తిరెడ్డి వేణు గోపాల్ రెడ్డి, డాక్టర్ ఎర్రల సుదర్శన్, గ్రామ పంచాయతీ కారోబార్ తాళ్ళపెల్లి కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూలూరి రాజేష్ గౌడ్, బీజేపీ మండల కార్యదర్శి న్యాల రమేష్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ బాల వెంకటేశ్వర రెడ్డి, గొల్లమారి ఇన్నారెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు యూత్ నాయకులు, గ్రామ మహిళలు, ప్రజలు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై బతుకమ్మ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించిన ఎస్ఐ రాజ్ కుమార్

- ప్రతాప్ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

పర్వతగిరి, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని చాటిచెప్పేలా వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో ప్రతాప్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా సాగింది. ఈ టోర్నమెంట్‌లో భాగంగా నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌ను పర్వతగిరి నూతన ఎస్ఐ పి. రాజ్ కుమార్ ప్రారంభించారు. ప్రతాప్ యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు ఫైనల్ మ్యాచ్‌కు హాజరైన ఎస్ఐ రాజ్ కుమార్ వాలీబాల్‌ను సర్వీస్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడల పట్ల యువత ఆసక్తి కనబరచడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ పి. రాజ్ కుమార్‌ను ప్రతాప్ యూత్ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థాయి టోర్నమెంట్ నిర్వహణతో క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొందని, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుసం రాంచందర్, ప్రతాప్ యూత్ సభ్యులు, టోర్నమెంట్ నిర్వాహకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరిలో పూల పండుగ.. బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి!

- గల్లీగల్లీ నుంచి తరలివచ్చిన ఆడపడుచులు..
- బతుకమ్మ పాటలతో మార్మోగిన పురవీధులు
- సర్పంచ్, పాలకవర్గం అద్భుత ఏర్పాట్లు.. కన్నులపండువగా సాగిన వేడుకలు

పర్వతగిరి, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా జరి గాయి. పూల పండుగతో పర్వతగిరి పురవీధులన్నీ పులకించిపోయాయి. రంగురంగుల పూలతో అం దంగా పేర్చిన బతుకమ్మలను చేతబట్టి గ్రామం లోని గల్లీగల్లీ నుంచి మహిళలు పెద్ద ఎత్తున వేణుగోపాల స్వామి ఆలయం వద్దకు తరలివ చ్చారు. సంప్రదాయ వస్త్రధారణలో ముస్తాబైన ఆడపడుచులు బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆటపాటలతో సందడి చేశారు.

ఆటపాటలతో హోరెత్తిన పర్వతగిరి : బతుకమ్మ పాటల మధుర స్వరాలు.. రంగురంగుల పూల బతుకమ్మల అందాలు.. మహిళల ఉత్సాహభరిత నృత్యాలతో వేడుకలు కన్నులపండువగా సాగాయి. అనంతరం మహిళలంతా ఒక్కచోట చేరి బతుకమ్మలను తీసుకొని పొలుకమ్మ చెరువు వద్దకు చేరుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ఆత్మీయతకు, పల్లె సంస్కృతికి అద్దం పట్టేలా బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి.

సర్పంచ్, పాలకవర్గం ఏర్పాట్లు అద్భుతం : బతుకమ్మ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామ సర్పంచ్, పాలకవర్గం చేసిన ఏర్పాట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పండుగకు తరలివచ్చిన మహిళలకు ఇబ్బందులు కలగకుండా వేడుకలు సజావుగా సాగేందుకు చేసిన ఏర్పాట్లు ప్రశంసనీయంగా నిలిచాయి. గ్రామస్థుల భాగస్వామ్యంతో పండుగను ఘనంగా నిర్వహించడంతో మహిళల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

పూల పండుగతో పల్లెకు కొత్త కళ : తెలంగాణ అస్తిత్వాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ పర్వతగిరిలో సంప్రదాయాల వైభవాన్ని మరోసారి చాటింది. పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళల సామూహిక ఆటపాటలు, పండుగ సందడి గ్రామానికి కొత్త కళను తీసుకొచ్చాయి. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ, ఐకమత్యంతో పండుగను జరుపుకోవడం పర్వతగిరి ప్రత్యేకతగా నిలిచింది.

పత్తిపల్లిలో బతుకమ్మ విగ్రహం ఆవిష్కరించిన డిసిసి అధ్యక్షుడు పైడాకుల అశోక్

ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) : ములుగు మండలం పత్తిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ధరావత్ సరిత సారయ్య ఆధ్వర్యంలో గ్రామ సమీపం లోని మంచి నీళ్ళ కుంట వద్ద బతుకమ్మ విగ్రహ ప్రారంభ కార్యక్రమం జరి గింది. కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహావిష్కరణ చేసి గ్రామస్థులకు సద్దుల బతుకమ్మ,దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,ములుగు మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి, కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధ్యక్షుడు ముశినేపల్లి కుమార్ గౌడ్, కిసాన్ కాం గ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చింతని ప్పుల బిక్షపతి, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు కంబాల రవి, జిల్లా ప్రచార కార్యదర్శి నూనేటి శ్యామ్,గ్రామ ఉప సర్పంచ్ పోరిక భద్రు నాయక్,గ్రామ కమిటీ అధ్యక్షుడు అర్షం రఘు సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు,యూత్ నాయకులు మహిళా నాయకులు పాల్గొన్నారు.

గ్రామదేవతల ఆశీస్సులతో ఊరు సుభిక్షంగా ఉండాలి

న్యాల అశోక్ యాదవ్

సంగెం, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : ఘనంగా బొడ్రాయి, పోచమ్మ తల్లి పునఃప్రతిష్టా మహోత్సవాల 11వ వార్షికోత్సవం గ్రామ ప్రజలు అష్టైశ్వర్యా లతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవత బొడ్రాయి మరియు పోచమ్మ తల్లి పునఃప్రతిష్టా మహోత్సవం జరిగి 11 వసంతాలు పూర్తయిన శుభ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా పెద్ద గొల్ల, యాదవ సంఘం కుల పెద్దమనిషి, గ్రామ బొట్టు దారుడు మరియు యాదవ రాజ్యాధికార సాధన సమితి వరంగల్ జిల్లా అధ్యక్షులు న్యాల అశోక్ యాదవ్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామదేవతల ఆశీస్సులు ఎల్లప్పుడూ గ్రామంపై ఉండాలని, గ్రామ ప్రజలందరూ ఎలాంటి ఆపదలు లేకుండా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని దేవుళ్లను వేడుకున్నట్లు తెలిపారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండి, ప్రతి ఇల్లు సిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యాదవ సంఘం నాయకులు, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్ల తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మండలవ్యాప్తంగా అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

విద్యుద్దీపాల వెలుగుల్లో ఆడపడుచుల ఆటపాటలు.. చిన్నారుల సందడి

భీమదేవరపల్లి అక్టోబర్ 18 ప్రజా జ్యోతి : మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల వెలుగుల్లో ఆడపడుచులు బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. గ్రామాల్లో సర్పంచులు ఏర్పాటు చేసిన లైటింగ్ ఏర్పాట్లు ఆకట్టుకోవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. చిన్నారులు తమ చేతులతో బతుకమ్మలను ఎత్తుకొని వెళ్తున్న దృశ్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మహిళలు బతుకమ్మలను చేతబట్టి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనగా, యువత సెల్ఫీలు, ఫొటోలతో సందడి చేసింది. మహిళలతో పాటు పురుషులు, గ్రామ పెద్దలు సైతం బతుకమ్మ ఆటల్లో పాల్గొన్నారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' పాటలు, కోలాటాలతో గ్రామాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. ముల్కనూరు ఎస్సై ఎం.రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తూ వేడుకలను పర్యవేక్షించారు. అయితే, కొన్ని గ్రామాల్లో అక్కడక్కడా యువకుల మధ్య స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఏసీపీ సతీష్ బాబు

శాయంపేట అక్టోబర్ 18 ప్రజా జ్యోతి : ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పరకాల ఏసిపి సతీష్ బాబు పేర్కొన్నారు. ఆయన ఆదివారం శాయంపేట పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. కేసులకు సంబంధించిన డైరీ ఫైల్స్ సీసీటీఎన్ఎస్ రికార్డులు సన్నిహిత రిజిస్టర్లు పరిశీలించారు. ముఖ్యంగా రౌడీషీటర్లకు సంబంధించిన రిజిస్టర్లు సీట్లు ఆన్లైన్ రికార్డుల అప్డేట్స్ సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పోలీస్ సిబ్బంది కిట్లను తనిఖీ చేశారు. అనంతరం ఏసిపి మాట్లాడుతూ దసరా పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సిఐ సుధాకర్ రెడ్డి ఎస్సై పరమేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంచర్ల జిపి సిబ్బందికి పండుగ కానుకలు అందజేత

ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) : ములుగు మండలం ఇంచర్ల గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ సర్పంచ్ ముశినెపల్లి కుమార్ గౌడ్ ఉప సర్పంచ్,వార్డు సభ్యులు కలిసి గ్రామ పంచాయతీ సిబ్బందికి పండుగ కానుకగా నూతన వస్త్రాలను అందజేయడం జరిగింది.అదేవిధంగా ఇంచర్ల గ్రామాన్ని సందర్శించిన విదేశీ మహిళను శాలువాతో సత్కరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముశినెపల్లి కుమార్ గౌడ్ మాట్లాడుతూ..గ్రామ పరిశు భ్రత,పారిశుద్ధ్యం, ప్రజలకు అవసరమైన సేవలు అందించ డంలో పంచాయతీ సిబ్బంది కృషి అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో సిబ్బంది పాత్ర కీలకమని, వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పండుగలు ఆనందాన్ని పంచుకోవడమే కాకుండా, మనతో కలిసి పనిచేసే ప్రతి ఒక్కరిని గౌరవిస్తూ వారి జీవితాల్లో సంతోషాన్ని నింపే సందర్భాలని అన్నారు. సిబ్బందికి పండుగ కానుకలు అందించడం ద్వారా వారిలో ఆనందాన్ని, ఆత్మీయతను పెంపొందించడమే తమ ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఇంచర్ల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి భరోసా ఇచ్చారు. ఆత్మకూరు మండలంలోని హౌస్ బుజుర్గ్, కటాక్షపూర్, ఆత్మకూరు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన నీలం సారయ్య, వటుకుల నరసింహరెడ్డి, ఉప్పుల లింగమూర్తి కుటుంబాలను ఆయన శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. కష్టసుఖాల్లో బాధిత కుటుంబాలకు తోడుగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి నూతన ఎస్సై రాజ్‌కుమార్‌కు ప్రెస్ క్లబ్ అభినందనలు

శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన మండల ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు

పర్వతగిరి, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పెగడ రాజ్‌కుమార్‌ను పర్వతగిరి మండల ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై రాజ్‌కుమార్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై రాజ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పర్వతగిరి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు ఆయన చేపట్టే చర్యలకు సహకరిస్తామని ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు తెలిపారు. పోలీసు శాఖకు, జర్నలిస్టులకు మధ్య సమన్వయం కొనసాగిస్తూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని పేర్కొన్నారు.

పల్లెల్లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

శాయంపేట అక్టోబర్ 18 ప్రజా జ్యోతి : మండల కేంద్రంలోని పలు గ్రామాలలో బతుకమ్మ ఏర్పాట్లను ఆదివారం చురుగ్గా ఏర్పాటు చేయడంతో ఆడపడుచులు అత్యంత పవిత్రమైన పండుగగా భావిస్తూ కుటుంబ సభ్యులందరూ కలిసి జరుపుకున్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పల్లెల్లో ఆడపడుచులకు రాత్రి వేళలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వీధి దీపాలు ఏర్పాటు చేశారు. గ్రౌండ్స్ ను శుభ్రం చేయించారు. సౌండ్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేశారు. ఆడపడుచులు రంగురంగుల తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చుకొని ఇంటి నుండి అట్టహాసంగా బయలుదేరారు. రకరకాల పాటలతో హోరెత్తిస్తున్న ఆటపాటలతో గ్రామాలలోని బతుకమ్మ ఆటస్థలం పరిసర ప్రాంతాలు సందడిగా నెలకొన్నాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ రకరకాల పాటలతో నృత్యాలతో విన్యాసాలు చేస్తూ ఆనందంగా ఉత్సాహంగా పండగ వాతావరణాన్ని జరుపుకున్నారు.

దేవరకొండలో ఫ్లెక్సీల తొలగింపుపై బీఆర్ఎస్ తీవ్ర నిరసన

ప్రజాదరణను అడ్డుకోలేరు.. రాజకీయ కక్షసాధింపులకు భయపడం

దేవరకొండ, అక్టోబర్ 18, (ప్రజా జ్యోతి) :
విజయదశమి పండుగ సందర్భంగా దేవరకొండ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.ప్రతిపక్ష నాయకుల ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అధికార పార్టీ, ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదు.అధికార పార్టీ తీరుపై బీఆర్ఎస్ ఆగ్రహం!పండుగ శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీల తొలగింపు వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి చర్యలతో నాయకులపై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని, పార్టీ పట్ల ఉన్న విశ్వాసాన్ని దూరం చేయలేరు.దేవరకొండ ప్రజలు అన్ని పరిణామాలను గమనిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష గొంతును నొక్కే ప్రయత్నాలను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కొంటాం. ఫ్లెక్సీల తొలగింపుపై సంబంధిత అధికారులు స్పందించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామ్యంలో ప్రజల అభిమానమే అసలైన బలం.. రాజకీయ కక్షసాధింపులకు ప్రజలే తగిన సమాధానం చెబుతారు!

ఆరెగూడెంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న దైద రవీందర్

చిట్యాల, అక్టోబర్ 18: ప్రజా జ్యోతి
నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామంలో శ్రీ

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ నాగంపల్లి శ్యామ్ ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, నకిరేకల్ నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, పెద్దకాపర్తి గ్రామ మాజీ సర్పంచ్, డీసీసీ ఉపాధ్యక్షుడు కందమళ్ల శిశుపాల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగంపల్లి కిషోర్, ఆరెగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్, బోయపల్లి వెంకన్న గౌడ్, పెద్దకాపర్తి కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు లింగస్వామి, యువ నాయకుడు అరుణ్, వెంకన్న, దశరథ, రాములు, నరసింహ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా కులవృత్తుల వారికి నూతన వస్త్రాల పంపిణీ

నాగారం అక్టోబర్ 18 ప్రజా జ్యోతి:
బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని నాగారం గ్రామ సర్పంచ్ గుంటకండ్ల రామచంద్రారెడ్డి గ్రామ సంప్రదాయం ప్రకారం కులవృత్తుల వారికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.పండుగల సందర్భంగా గ్రామంలోని కులవృత్తుల వారిని గౌరవిస్తూ వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ

గ్రామీణ సమాజంలో కులవృత్తుల వారి సేవలు కీలకమని, వారి కృషి గ్రామీణ జీవన విధానంలో ప్రత్యేక స్థానం కలిగి ఉందని పేర్కొన్నారు. పండుగలను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిప్పలపల్లి సోమయ్య,కుంభం కరుణాకర్,ఉపసర్పంచ్ వంగూరి అంజి యాదవ్, కోడూరి సోమయ్య,యాదగిరి,సాలయ్య,సోమనర్శి,సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కోమటి కుంట రైతుల మోటార్ వైర్లు అపహరణ

పాలకవీడు, అక్టోబర్ 18(ప్రజా జ్యోతి):
పాలకవీడు మండలం కోమటి కుంట గ్రామ శివారులో ని ఉన్న పంట పొలాలలో ని

దాదాపు గా 50 నుండి 100 కరెంటు మోటార్ల కేబుల్ వైర్లు ను శనివారం రాత్రి 11గంటల నుండి 1 గంటల మధ్య లో దొంగిలించారు. పొద్దున్నే రైతులు తమ పొలాల వద్దకు పోయి చూసుకొని మా మోటార్ వైర్లు దొంగి లించారని ఒకరితో ఒకరు చెప్పుకొంటున్నారు. ఇలా జరగటం ఇది రెండవసారి గత మే నెలలో కూడా ఒకసారి ఇలాగే మోటార్ కేబుల్ వైర్లు కోసుకొని పోయారు. ఈ వరుస దొంగతనాలు చేస్తున్న వ్యక్తులపై పోలీస్ లు నిఘా పెట్టి పట్టుకొని వారిని శిక్షించాలని భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకొంటున్నారు.

పట్టభద్రుల సమస్యలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలి: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నల్లగొండ అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి):
నకిరేకల్,: కేతపల్లి మండలాల్లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టభద్రుల ఓటరు నమోదు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో విద్యావంతులు, నిరుద్యోగులు, పట్టభద్రులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఏటా ఉద్యోగ నియామక క్యాలెండర్ విడుదల చేస్తామని, లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని ఆరోపించారు.
అర్హులైన నిరుద్యోగ యువతకు నెలవారీ నిరుద్యోగ

భృతి అందిస్తామన్న హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. మెగా డీఎస్సీతో పాటు ఇతర ఉద్యోగ నియామకాలు, పరీక్షల నిర్వహణలో జాప్యం, గందరగోళం కారణంగా నిరుద్యోగ యువత తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారని అన్నారు.
ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం, పట్టభద్రుల సంక్షేమం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించలేదని మండిపడ్డారు. విద్యా వ్యవస్థలో సమస్యలు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వేదికగా మలచుకోవాలని ఆయన కోరారు. ఓటరు నమోదు చేసుకోని అర్హులైన పట్టభద్రులు వెంటనే నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వానికి ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పేందుకు విద్యావంతులు, నిరుద్యోగులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు

ప్రతి ఒక్కరూ దుర్గామాత అనుగ్రహం పొందాలి

దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ, అక్టోబర్ 18, (ప్రజా జ్యోతి) :
ప్రతి ఒక్కరూ దుర్గామాత అనుగ్రహాన్ని పొందాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు. ఆదివారం శ్రీశ్రీశ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల

సందర్భంగా దేవరకొండ పట్టణంలోని మార్కండేయ ఆలయం, పాత రామాలయం, 1వ వార్డులో కొలువుదీరిన దుర్గామాతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని, ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.తెలంగాణ ప్రజలు ఎక్కడ ఉన్నా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటారని అన్నారు. పూర్వీకులు అందించిన సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగల ద్వారా సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మిక భావనలను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు.అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు, అర్వపల్లి నర్సింహ, మద సుధాకర్ గౌడ్, వంగల కృష్ణారెడ్డి, వేముల రాజు, పొట్ట మధు, ముత్యాల రవికుమార్, వనం జగదీశ్వర్, రమావత్ దామోదర్, మకాం చంద్రమౌళి, పగిడిమర్రి నాగరాజు, పగిడిమర్రి సతీష్, ముదిగొండ హరిదాస్, వల్లసాని వెంకన్న, శేరిపల్లి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి రూ.2.25 కోట్ల నిధులు మంజూరు చేయాలి

నాలుగు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి మంత్రి అజారుద్దీన్‌కు ఎమ్మెల్యే బాలునాయక్ వినతి

దేవరకొండ, అక్టోబర్ 18, (ప్రజా జ్యోతి) :
దేవరకొండ నియోజకవర్గంలో ముస్లిం, క్రైస్తవ మైనారిటీల కోసం నాలుగు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి

మహమ్మద్ అజారుద్దీన్‌ను కోరారు. ఆదివారం మంత్రి నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు.దేవరకొండ, చింతపల్లి, డిండి ప్రాంతాల్లో ముస్లిం మైనారిటీల కోసం ఒక్కో హాల్‌కు రూ.50 లక్షల చొప్పున రూ.1.50 కోట్లు, దేవరకొండలో క్రైస్తవ మైనారిటీల కమ్యూనిటీ హాల్‌కు రూ.75 లక్షలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూనిటీ హాళ్లు మైనారిటీ వర్గాల సామాజిక, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే వివరించారు. ఆయా వర్గాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత నిధులను త్వరగా మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అజారుద్దీన్‌ను కోరారు.

సర్పంచ్ ఇంటి ముందే బురద రోడ్డు.. అమీనాబాద్‌లో ఇదేనా అభివృద్ధి!

గుంతల్లో నిలిచిన వర్షపు నీరు.. రాకపోకలకు ప్రజల అవస్థలు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించేదెప్పుడు?

అనంతగిరి, అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి):
గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో

రహదారి దుస్థితి ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. గ్రామ సర్పంచ్ ఇంటి ముందున్న ప్రధాన రహదారే బురదమయంగా మారి ప్రజలకు నిత్య నరకాన్ని చూపిస్తోంది.

గుంతలమయంగా రహదారి.. అడుగడుగునా అవస్థలు

వర్షపు నీరు రహదారిపై ఉన్న గుంతల్లో నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రహదారి అంతా బురద పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం నెలకొంది. పాదచారులు సైతం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడింది. నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పనులపై బయటకు వెళ్లాల్సి వచ్చినా, తిరిగి ఇళ్లకు చేరుకోవాల్సి వచ్చినా బురద రహదారిపై ప్రయాణం కష్టతరంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ ఇంటి ముందే దుస్థితి..

ఇక మిగతా వీధుల సంగతేంటి?

గ్రామానికి ప్రాతినిధ్యం వహించే సర్పంచ్ ఇంటి ముందే రహదారి ఇంత దారుణంగా ఉంటే, గ్రామంలోని ఇతర వీధుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజలకు కనీస రహదారి సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యం ఎందుకు కొనసాగుతోందని ప్రశ్నిస్తున్నారు. గ్రామాభివృద్ధి మాటలకే పరిమితమవుతోందా? ప్రజల సమస్యలు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి రావడం లేదా? అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్

రహదారి సమస్యను ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్రంగా పరిగణించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా, రహదారిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధి అంటే కేవలం హామీలు ఇవ్వడం, ప్రకటనలు చేయడం మాత్రమే కాదని.. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడమే నిజమైన అభివృద్ధి అని స్థానికులు పేర్కొంటున్నారు.
ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అమీనాబాద్ రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతారా? లేక ప్రజలు బురద రహదారిపైనే అవస్థలు పడుతూ ఉండాలా? అన్నది వేచి చూడాల్సిందే.

గౌరమ్మ తల్లితో బతుకమ్మను పేర్చి.. భక్తిశ్రద్ధలతో వేడుకలు

వేడుకలో పాల్గొన్న జడ్పీ మాజీ చైర్ పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్ రావు

తుంగతుర్తి, అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి):
సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి గౌరమ్మ తల్లితో

బతుకమ్మను పేర్చి భక్తిశ్రద్ధలతో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మను అలంకరించి గౌరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. గౌరమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని కోరుకున్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ ఆనందంగా వేడుకలు జరుపుకున్నారు. తెలంగాణ పల్లెల్లో పూల పండుగ సందడి నెలకొంది.

అనుమానాస్పద మృతి.. కేసు నమోదు

కొత్తగూడెం గ్రామానికి చెందిన కంచం సందీప్ మృతి

డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం ఆధారాల సేకరణ.. పోస్టుమార్టం నివేదికపై పోలీసుల దృష్టి

తుంగతుర్తి, అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి):
తుంగతుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన కంచం సందీప్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయాన్ని తుంగతుర్తి పోలీసులు పత్రికా ప్రకటన లో వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సందీప్ మృతి చెందిన విషయం సమాచారం అందడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితులను పరిశీలించారు. మృతదేహానికి సంబంధించిన చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేస్తూ, మృతికి అసలు కారణాలను నిర్ధారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలను సేకరించడంతో పాటు, సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు.అదేవిధంగా డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో సంఘటనా స్థలంలో ఆధారాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి నిర్వహించిన పోస్టుమార్టం నివేదికతో పాటు ఇతర సాంకేతిక, సంబంధిత అంశాలను పరిశీలించిన అనంతరం మృతికి గల వాస్తవ కారణాలు స్పష్టమవుతాయని వెల్లడించారు.ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోందని, దర్యాప్తు పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్ధారణకు రావడం సరికాదని పోలీసులు స్పష్టం చేశారు. ఘటనకు సంబంధించి నిర్ధారణ కాని సమాచారాన్ని ప్రచారం చేయడం, వదంతులను వ్యాప్తి చేయడం ద్వారా ప్రజల్లో అనవసర ఆందోళన కలిగించవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు.దర్యాప్తు పూర్తయిన అనంతరం ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెల్లడిస్తామని తుంగతుర్తి పోలీసులు తెలిపారు.

దసరా వేడుకలను శాంతివత్తంగా జరుపుకోవాలి

◆ బంజారా సేవా సమితి జిల్లా ఏఐబిఎస్ అధ్యక్షులు మోహన్ నాయక్ పిలుపు



ఇందల్వాయి (ప్రజా జ్యోతి) అక్టోబర్. 18 ఇందల్వాయి మండల కేంద్రంలో రేపు సేవాలాల్ మహారాజ్ జగదాంబ దేవి వద్ద స్వీట్లు బలి అర్పణల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎఐబిఎస్ అధ్యక్షులు మోహన్ నాయక్ తెలిపారు ఈ సందర్భంగా మండల బంజారా సేవా సమితి నాయకులు గ్రామ ప్రజలకు అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్లకు అందరూ కలిసి దసరా పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ బంజారా సమాజ ప్రజలందరికీ దసరా పండగ శుభాకాంక్షలు తెలియజేశారు సేవలాల్ మహారాజ్ జగదాంబ దేవి వద్ద రేపు జరిగే కార్యక్రమాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని ఆయన బంజారా సేవ సమితి యువతి యువకులకు పిలుపునిచ్చారు. మండల నాయకులు తుకారాం నాయక్ మాట్లాడుతూ సేవలాల్ మహారాజ్ జగదాంబ దేవి వద్ద స్వీట్లు బలి అర్పణ కార్యక్రమం శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో మోతిలాల్ నాయక్ ట్రెజరర్ దిలీప్ కుమార్ రవికుమార్ మోతిలాల్ నాయక్ పాల్గొన్నారు.

ఇందల్వాయి సొసైటీ భవనం

శిథిలవస్థలో పట్టించుకోని అధికారులు

◆ కమిషన్ల పై ఉన్న శ్రద్ధ కార్యాలయం పై లేదా? ప్రజల ఆవేదన

ఇందల్వాయి (ప్రజా జ్యోతి) అక్టోబర్. 18 ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలో నీ సొసైటీ భవనం శిధిలావస్థకు చేరుకున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం కనీసం రంగులు వేయించడానికి కూడా నోచుకోకపోవడం మరోవైపు భవనం కూలిపోయే స్థితికి చేరుకోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమే అని ప్రజలు విమర్శిస్తున్నారు. సొసైటీ భవన నిర్వహణను గాలికి వదిలేసిన అధికారం కోసం చూడని తప్ప పట్టించుకోకుండా వదిలేయడం చాలా విడ్డూరమని ప్రజలు అంటున్నారు భవనంపై దృష్టి సాధించి అవసరమైన మరమతులు చేపట్టవలసిన సీఈవో

సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న సొసైటీ భవనాన్ని పరిశీలించి అవసరమైన మరమతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇది ఎంతవరకు ముందుకెళ్తదో వేచి చూడవలసిందే?

దుర్గామాత రూపంలో దర్శనం ఇచ్చిన రేణుక మాత ఎల్లమ్మ

ప్రజా జ్యోతి,లింగంపేట్ అక్టోబర్ 18 లింగంపేటలో గల రేణుక మాత ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం ఎనిమిదో రోజు అమ్మవారు దుర్గామాత అలంకారంలో దర్శమించారు,ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు, భక్తులు దేవి కటాక్షంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ బుర్ర నారా గౌడ్ తెలిపారు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇస్లామిక్ బోధనలతో సమాజంలో మార్పు తేవాలి

◆ యువతకు వక్తల పిలుపు

(ప్రజా జ్యోతి నిజామాబాద్) : ఇస్లామిక్ బోధనలను ఆచరణలో చూపుతూ సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి యువత ముందుకు రావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జమాఅతే ఇస్లామీ హింద్ నిజామాబాద్, స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఓ) ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఖిల్లా రోడ్డులో 'బహార్ హో కే ఖిజాన్, లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే అంశంపై బహిరంగ సభ నిర్వహించారు.

సమాజంలో న్యాయం నెలకొల్పాలి:

జమాఅతే ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షుడు మౌలానా వలియుల్లా సయీదీ ఫలాహీ మాట్లాడుతూ.. ఇస్లాం సంపూర్ణ జీవన విధానమని, వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, వ్యాపార రంగాలకు మార్గదర్శకత్వం అందిస్తుందని తెలిపారు. ప్రవక్త ముహమ్మద్ (స) జీవితం మానవాళికి ఆదర్శమన్నారు. పేదలు, అనాథలు, బలహీనుల హక్కులను కాపాడాలని, సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పేందుకు కృషి చేయాలని సూచించారు. మతపరమైన విభేదాలకు దూరంగా ఉంటూ ఐక్యతను పెంపొందించాలని, దేశంలో శాంతి, సోదరభావం, జాతీయ సమైక్యత బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత సామర్థ్యాలను వినియోగించుకోవాలి: ఎస్ఐఓ జాతీయ అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత తమ సామర్థ్యాలను గుర్తించి స్పష్టమైన లక్ష్యంతో ముందుకు

సాగాలన్నారు. స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకొని, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేయాలని సూచించారు. మానవత్వమే ప్రధాన సందేశం: ఎస్ఐఓ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. మానవాళిని అంధకారం నుంచి వెలుగువైపు నడిపించడంలో ముస్లింలు బాధ్యతాయుత పాత్ర పోషించాలని అన్నారు. జమాఅతే ఇస్లామీ హింద్ తెలంగాణ షూరా సభ్యుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. ప్రవక్త ముహమ్మద్ (స) బోధనల ద్వారా సమాజంలో వివక్ష, అసమానతలను తొలగించి న్యాయాన్ని నెలకొల్పాలని పేర్కొన్నారు. జమాఅతే ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షుడు మహమ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ.. సామూహిక కృషి, స్పష్టమైన లక్ష్యంతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జమాఅతే ఇస్లామీ హింద్ నగర నాజిమ్ అబ్దుర్ రెహమాన్ దావూదీ, స్థానిక అమీర్లు అబ్దుల్ సత్తార్ ఖాన్, మహమ్మద్

ఖాలిద్ అహ్మద్, మహమ్మద్ గౌస్ పాషా, మహమ్మద్ అబ్దుల్ రహీమ్, ఎస్ఐఓ నిజామాబాద్ అధ్యక్షుడు సయ్యద్ అన్సార్ అలీ, ఇతర నాయకులు పాల్గొన్నారు. మహమ్మద్ ఫైసల్ ఖాన్ కార్యక్రమాన్ని నిర్వహించగా, మహమ్మద్ ఖాలిద్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు.

టిఆర్ పి విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ప్రారంభించిన సినీ నటి నిధి అగర్వాల్

నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : నిజామాబాద్ నగరంలోని టిఆర్ పి విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ఆదివారం సినీ నటి నిధి అగర్వాల్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ నిజామాబాద్‌లో విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. టిఆర్పి విశిష్టలో సంప్రదాయ కళాత్మకతను ఆధునిక శైలితో మేళవించిన విభిన్నమైన డిజైన్లు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ నిజామాబాద్ కు ప్రతి షోరూమ్ ప్రతి బ్రాండ్ రావడం ఎంతో గర్వంగా ఉందని మరిన్ని ఇతర

బ్రాండ్లు హైదరాబాద్ తో సమానంగా నిజామాబాద్ లో ఏర్పాటు చేయాలని ఇక్కడ ఉన్న వారికి ఉపాధి అవకాశాలు, పట్టణ అభివృద్ధి మరింత పెరగాలి అని తెలిపారు. తొడుపునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సంప్రదాయ ఆభరణాల తయారీ నైపుణ్యాన్ని ఆధునిక డిజైన్లతో సమన్వయం చేస్తూ అద్భుతమైన ఆభరణాల కలెక్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. మహిళలు, పురుషుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బంగారు, వజ్రాభరణాలతో పాటు నెక్లెస్‌లు, బ్రాస్‌లెట్లు, చెవి ఆభరణాలు,ఉంగరాలు తదితర విస్తృత శ్రేణి ఆభరణాలు తమ షోరూమ్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. నైపుణ్యం కలిగిన కళాకారులు ప్రతి ఆభరణాన్ని ఎంతో శ్రద్ధతో, నైపుణ్యంతో ప్రత్యేకమైన డిజైన్లలో రూపొందిస్తారని తెలిపారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా తమకు నచ్చిన ప్రత్యేకమైన ఆభరణాలను రూపొందించుకునేందుకు కస్టమైజ్డ్ జ్యువెలరీ డిజైన్ సేవలను కూడా అందిస్తున్నామని పాలభట్ల ఆనంద్ బాబు పేర్కొన్నారు. నిధి అగర్వాల్ రాకతో షోరూమ్ ప్రారంభోత్సవం సందడిగా మారింది. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అభిమానులకు నిధి అగర్వాల్ ఆప్యాయంగా అభివాదం చేస్తూ సందడి చేయడంతో కార్యక్రమానికి మరింత ఆకర్షణ చేకూరింది.

మల్కాపూర్‌లో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారి దర్శనం

◆ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ◆ భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రి ఉత్సవాలు

కొండాపూర్ ప్రజా జ్యోతి మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మహిళామణుల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామం పారాయణం నిర్వహించారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో మార్మోగాయి. గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ వేడుకలకు సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొందారు. నవరాత్రి ఉత్సవాలతో మల్కాపూర్ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, గ్రామస్థులు, మహిళలు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ పవన్ కుమార్, మారేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మునూరు రాజు, దేవేందర్, గజాల ప్రభాకర్, సభ్యులు సందీప్ గౌడ్, అనంతయ్య, కుమారి దశరథ్, సునుగంటి ప్రభాకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు గౌడ్, నోముల వీరేశం, రాజు ముదిరాజ్, విట్టల్, గోవర్ధన్ రెడ్డి, జిల్లా నాయకులు కాసాల బుచ్చారెడ్డి, పార్టీ కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ కృషితో తొలగిన చీకట్లు

◆ 13వార్డులో హైమాస్ట్ లైట్ల వెలుగులు ◆ కౌన్సిలర్ ఎర్ర విశాలి నాగరాజ్ గౌడ్‌కి వార్డు ప్రజల అభినందనలు

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలచే మన్ననలు పొందుతున్నారు సదాశివపేట పట్టణంలోని 13వ వార్డు కౌన్సిలర్ విశాలి ఎన్నికల్లో ప్రజలకు చేసిన వాగ్దానాలను ఒకొక్కటిగా నెరవేరుస్తూ ఆమె ముందుకు పోతున్నారు. ప్రజా సమస్యలే ధ్యేయంగా పనిచేస్తున్న 13వ వార్డు కౌన్సిలర్ వార్డులో ఎర్ర విశాలి

నాగరాజ్ గౌడ్ వార్డులో శ్రీరామ కళామందిరం ప్రధాన కూడలి అనునిత్యం చీకట్లో మగ్గుతుండడంతో ప్రజలు సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ విశాలి దృష్టికి తీసుకువచ్చారు. రాత్రి సమయంలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు, వికలాంగులు, నైట్ డ్యూటీ కి వెళ్లే కార్మికుల ఇబ్బందులను ఆకలింపు చేసుకున్న కౌన్సిలర్ ఎర్ర విశాలి వెంటనే మున్సిపల్ అధికారులతో చర్చించి యుద్ధ ప్రాతిపదికన శ్రీరామ కళామందిరం ప్రధాన కూడలిలో భారీ హై మాస్ట్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయించారు ఇప్పుడు శ్రీరామ కళామందిరం ప్రధాన కూడలి రాత్రి వేళల్లో హైమాస్ట్ లైటింగ్ సిస్టం వెలుగుల్లో పట్టపగలను తలపిస్తుండడంతో వార్డు ప్రజలు ఎన్నో ఏళ్లుగా నెలకొని ఉన్న సమస్యను ఒకటి రెండు రోజుల్లో పరిష్కరించిన వార్డు కౌన్సిలర్ ఎర్ర విశాలి నాగరాజు గౌడ్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ వార్డు అభివృద్ధికి కౌన్సిలర్ ఎర్ర విశాలి చేస్తున్న కృషి పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ, బిఆర్ఎస్ నాయకులు చింత సాయి డిడిగే నాగేష్, అడ్వకేట్ సంజేయ్, తదితరులు పాల్గొన్నారు

హత్నూర ప్రధాన రహదారిని వెంటనే బాగుచేయాలి

◆ ఏంఆర్‌పిఎస్ మరియు ప్రజాసంఘాల డిమాండ్

◆ జిల్లా కలెక్టర్ స్పందించి నూతన రహదారిని మంజూరు చేయాలి

హత్నూర 18 అక్టోబర్ (ప్రజా జ్యోతి) మండల కేంద్రమైన హత్నూర గ్రామంలోని ప్రధాన రహదారి దుస్థితిని నిరసిస్తూ డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం సమీపంలో ఆదివారం నాడు ఎం ఆర్ పి ఎస్ నాయకులు మరియు ప్రజాసంఘాలు మరియు హత్నూర గ్రామ ప్రజల సమక్షంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,హత్నూర ఐటీఐ నుంచి దేవులపల్లి గ్రామ గేట్ వరకు ఉన్న ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతిని, పెద్ద పెద్ద గుంతలతో మరణశాసనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులు, గ్రామ ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రహదారి దుస్థితి కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఇప్పటికే కొందరు ప్రాణాలు కోల్పోగా,మరికొందరు తీవ్ర గాయాలపాలయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ప్రతిరోజూ ప్రయాణించే ప్రధాన రహదారిపై ఇలాంటి దుస్థితి నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. ధర్నాలో పాల్గొన్న ఏం ఆర్ పి ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ మాట్లాడుతూ, హత్నూర ప్రధాన రహదారి సమస్యపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. సంబంధిత రోడ్లు మరియు భవనాల (=ఉదీ) శాఖ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారి సమస్యను ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని కోరారు. ముందుగా రహదారిపై ఉన్న గుంతలకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి, ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. అలాగే, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నూతన రహదారిని మంజూరు చేసి, నాణ్యతా ప్రమాణాలత పరిష్కరించాలని కోరారు.

ఘనంగా బతుకమ్మ పండుగ వేడుకలు

రాయికోడ్ అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి): తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను ఆకర్షణీయంగా అలంకరించి, సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పండుగ ప్రాంగణం మహిళల సందడితో కళకళలాడింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, పూల ప్రాధాన్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఈ వేడుకలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

సొంత ఖర్చులతో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

- సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి సేవాభావం

కొల్చారం, అక్టోబర్18 (ప్రజాజ్యోతి) మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న ఘనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ గ్రామ సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం ఉదయం తన సొంత డబ్బులతో గ్రామంలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. గ్రామ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులను గౌరవించాలనే ఉద్దేశంతో సర్పంచ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కాపాడటంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమైనది. ప్రతి రోజు గ్రామంలోని వీధులు, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచేందుకు వారు చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులు గ్రామ ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విధులతో పాటు సామాజిక బాధ్యతను కూడా గుర్తిస్తూ సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి తన వ్యక్తిగత

ఖర్చులతో కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం పలువురి ప్రశంసలు అందుకుంది. ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు గ్రామ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నర్సింలు, గ్రామ వార్డు సభ్యులు గురుకుల స్వరూప ప్రకాష్, అనిత బాలు, యాకోబు, మంద జగన్ పాల్గొన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులు బాగయ్య, గునుకుల సంసోన్, మైసగల్ల సామెల్, మైసగళ్ళ గంగులు, గూడముల బుజ్జి తదితరులు పాల్గొన్నారు. సొంత ఖర్చులతో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేసిన సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి సేవాభావాన్ని పలువురు అభినందించారు.

వృద్ధులకు కొండంత అండగా నరేందర్ రెడ్డి: మూడేళ్లుగా నిరంతర సేవలు

వెల్దుర్తి ప్రజాజ్యోతి అక్టోబర్ 18: మానవత్వమే మతంగా, సేవే లక్ష్యంగా, వృద్ధుల ముఖాల్లో చిరునవ్వులే తనకు నిజమైన సంతృప్తిగా భావిస్తున్న సేవామూర్తి హనుమన్నగారి నరేందర్ రెడ్డి. ఈ రోజుల్లో కన్న తల్లిదండ్రుల బాగోగులు చూడటానికే వెనుకాడుతున్న పరిస్థితుల్లో, ఎలాంటి స్వార్థం లేకుండా వృద్ధులను సొంత తల్లిదండ్రుల్లా భావిస్తూ, వారికి అండగా నిలుస్తున్న డీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీపీ హనుమన్నగారి నరేందర్ రెడ్డి సేవలు

నిజంగా అభినందనీయం. గత మూడు సంవత్సరాలుగా ప్రతిరోజూ రెండు పూటలా అన్నదానం చేస్తూ, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వృద్ధులకు ఇంటి వద్దకే భోజనం పంపిస్తూ వారి ఆకలి తీరుస్తున్నారు. అంతటితో ఆగకుండా ప్రతి దసరా పండుగకు నూతన వస్త్రాలను అందిస్తూ, వారి జీవితాల్లో ఆనందపు వెలుగులు నింపుతున్నారు. రక్తసంబంధం లేకపోయినా, పుత్రవాత్సల్యంతో వృద్ధులను ఆదరించడం, వారి కష్టాలను తనవిగా భావించడం, వారి కళ్లలో ఆనందాన్ని చూడటమే తనకు గొప్ప బహుమతిగా భావించడం నరేందర్ రెడ్డి విశాల హృదయానికి నిదర్శనం. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం దానం. ఆప్యాయతకు దూరమైన వృద్ధులకు ప్రేమను పంచడం మహోన్నతమైన మానవత్వం. అలాంటి గొప్ప సేవా మార్గంలో నరేందర్ రెడ్డి సాగిస్తున్న ప్రయాణం సమాజానికి స్ఫూర్తిదాయకం. ఆయన సేవలు మరెందరికో ఆదర్శంగా నిలవాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. ఆ భగవంతుని ఆశీస్సులు నరేందర్ రెడ్డి కి, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లుతూ మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టే శక్తిని ఆ దేవదేవుడు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అన్నారు. వృద్ధుల ఆశీర్వాదాలే మీకు కొండంత బలం కావాలి, మీరు పంచే అన్నం, చూపే ఆప్యాయత మరెన్నో జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు.

శ్రీ మహాలక్ష్మీ దేవికి మాజీ సర్పంచ్ నాయికోటి సుప్రజ భాస్కర్ ప్రత్యేక పూజలు

టేక్మాల్, అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి ప్రతినిధి) దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలోని శ్రీ కాళికామాత నాగులమ్మ దేవాలయంలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజున శ్రీ మహాలక్ష్మి దేవి అవతారంలో దర్శనమిచ్చిన దుర్గామాతకు టేక్మాల్ మాజీ సర్పంచ్ నాయికోటి సుప్రజా భాస్కర్ దంపతులు, సుబేధర్ సత్యనారాయణ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నాయికోటి సుప్రజా భాస్కర్ మాట్లాడుతూ... అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. దుర్గాష్టమి, విజయదశమి పండుగలను గ్రామంలో ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఫ్రెండ్స్ మహిళా గ్రూప్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దసరా పండుగ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

కొండపాక: అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి):-దసరా పండుగను పురస్కరించుకొని గ్రామపంచాయతీ సిబ్బందికి గ్రామపంచాయతీ పాలకవర్గం దుస్తులను పంపిణీ చేసింది. పండుగ వేళ సిబ్బందిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కలిసి దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, వీధుల పరిశుభ్రతతో పాటు ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. సిబ్బంది సేవలను గుర్తించి దసరా పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కొలుపుల గంగాధర్ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గామాత మండపాల సందర్శనలు: ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం

- కొల్చారం మండలంలో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి సుడిగాలి పర్యటన

కొల్చారం,అక్టోబర్ 18(ప్రజా జ్యోతి) నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆదివారం కొల్చారం మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. మండలంలోని రాంపూర్, కిష్టాపూర్, వరిగుంతం, కోనాపూర్, ఎనగండ్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు ఆవుల రాజిరెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కిష్టాపూర్ గ్రామంలో నిర్మాణం పూర్తయిన రెండు

ఇందిరమ్మ ఇళ్లను ఆవుల రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులవారి మల్లేశం గౌడ్ కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. లబ్ధిదారులైన కమ్మరి జ్యోతి--అశోక్, దూదేకుల సల్మా--యూసుఫ్ కుటుంబాలను శాలువాలతో సన్మానించారు. పేదలకు సొంతింటి సౌకర్యం కల్పించడంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలకంగా నిలుస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులవారి మల్లేశం గౌడ్, చిన్నఘణపూర్ సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి, రాంపూర్ సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్, మాజీ సర్పంచ్ రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, జంగిటి నాగరాజు, శ్రీశైలం, బండి మల్లేశం, ఎనగండ్ల మురళి, విజయ్, అచ్చనపల్లి శ్రీరాములు, ప్రవీణ్ రెడ్డి, రమేష్, పెద్దల కిషన్, నవీన్, పెంబరి మల్లేశం, మలిక్ ప్రవీణ్, భాస్కర్, ఎనగండ్ల రమేష్, డీలర్ బాలరాజ్, దాసు, మహేశ్వర్ రెడ్డి, కమ్మరి వీరేందర్, పెద్ది నరేష్, వార్డు సభ్యులు, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండుగల వేళ పరిశుభ్రతకు పెద్దపీట

- సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ప్రత్యేక చొరవ

- మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 423వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమం

తూప్రాన్ ప్రజా జ్యోతి అక్టోబర్ 18: తూప్రాన్ మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో 423వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని 8వ వార్డులో నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా వీధుల్లోని పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్

వ్యర్థాలను తొలగించి, చీపుర్లతో సీసీ రోడ్లను శుభ్రపరిచారు. బతుకమ్మ, దసరా పండుగలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలోని అన్ని వీధులను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు, పండుగల సందర్భంగా గ్రామానికి వచ్చే వారు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేలా పారిశుధ్య పనులను నిరంతరం కొనసాగిస్తున్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యమే కీలకం అనే సంకల్పంతో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రతి వారం కొనసాగిస్తూ, గ్రామాన్ని ఆదర్శంగా నిలిపేందుకు సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ కృషి చేస్తున్నారు. గ్రామ వీధులు పరిశుభ్రంగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు కూడా పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వామి, పాలకవర్గ సభ్యులు జిన్న కృష్ణ, మన్నె తిరుపతి, రేఖ నాగరాజు గౌడ్, సరిత పరమేష్ గౌడ్, యువత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక తెలంగాణ కోసం తెగించి పోరాడిన మెదక్ జిల్లా తెలంగాణ బిడ్డలు

- దసరా పండగ అంటే తెలంగాణ బిడ్డలకు ప్రజలకు ఎంతో ఆనందం

- కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ యువత విభాగం అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు

కొల్చారం, అక్టోబర్ 18(ప్రజా జ్యోతి) తెలంగాణలో మెదక్ జిల్లా అంటే తెలంగాణ కోసం పోరాడిన గడ్డ మెదక్ గడ్డ అని సంతోష్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, దసరా పండుగ అంటే, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ, విజయానికి సంకేతంగా జరుపుకునే విజయదశమి పండుగలు ప్రకృతితో మనకున్న విడదీయలేని అనుబంధాన్ని చాటిచెబుతాయని కొల్చారం మండలం బి ఆర్ఎస్ పార్టీ యువత విభాగం అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు అన్నారు. ప్రకృతిని

ఆరాధించడం, సంప్రదాయాలను గౌరవించడం, చెడుపై మంచి సాధించిన విజయాన్ని స్మరించుకోవడం ఈ పండుగల ప్రధాన సందేశమని ఆయన పేర్కొన్నారు. పండుగలు కేవలం ఆనందోత్సాహాలకే పరిమితం కాకుండా, సమాజానికి మంచి సందేశాన్ని అందించే వేడుకలుగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రకరకాల పూలను అందంగా పేర్చి పూజించడం మన సంస్కృతిలో ప్రకృతికి ఉన్న విశిష్ట స్థానాన్ని తెలియజేస్తుందని సంతోష్ రావు వివరించారు. ప్రకృతి ఒడిలో పూసే పూలను దేవతా స్వరూపంగా భావించి ఆరాధించడం వెనుక ప్రకృతిని ప్రేమించాలనే గొప్ప సందేశం దాగి ఉందన్నారు. పూల సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ, వాటి ప్రాధాన్యతను గుర్తిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ మనిషికి, ప్రకృతికి మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిని పూజించడం మాత్రమే కాదు దానిని కాపాడుకోవడం కూడా మన బాధ్యతే నేటి ఆధునిక జీవనశైలిలో అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరులు దెబ్బతింటున్నాయని, చెట్ల నరికివేత, ప్లాస్టిక్ వినియోగం, నీటి వృథా, వాయు కాలుష్యం వంటి సమస్యలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని ఆరాధించే పండుగలను జరుపుకుంటున్న మనం, అదే ప్రకృతిని కాపాడుకోవడంలోనూ ముందుండాలని పిలుపునిచ్చారు. పండుగల సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే పదార్థాల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహిత అలవాట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దసరా పండుగలో జమ్మిచెట్టుకు ప్రత్యేక స్థానం ఉందని, జమ్మి ఆకులను పరస్పరం పంచుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకోవడం మన సంప్రదాయంలోని ఆత్మీయతకు, ఐకమత్యానికి నిదర్శనమని తుంకులపల్లి సంతోష్ రావు అన్నారు. జమ్మిచెట్టును పూజించడం ద్వారా ప్రకృతిలోని వృక్ష సంపదకు మన సంస్కృతి ఎంతటి ప్రాధాన్యతను ఇచ్చిందో అర్థమవుతుందని పేర్కొన్నారు. చెట్లను దేవతా స్వరూపాలుగా భావించి గౌరవించే మన సంప్రదాయాలు, నేటి తరానికి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తు చేస్తున్నాయని వివరించారు. సంప్రదాయాలను పాటించడంతోపాటు వాటి వెనుక ఉన్న

అంతరార్థాన్ని అర్థం చేసుకుని ఆచరించినప్పుడే పండుగల అసలైన స్ఫూర్తి నిలుస్తుందని అన్నారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి. అదే స్ఫూర్తితో పర్యావరణానికి హాని చేసే అలవాట్లపై కూడా మనం విజయం సాధించాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెట్లను నాటడం, నాటిన మొక్కలను సంరక్షించడం, నీటిని పొదుపుగా వినియోగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి చిన్న చిన్న చర్యలు భవిష్యత్తులో గొప్ప మార్పులకు దారితీస్తాయని ఆమె పేర్కొన్నారు. పండుగల సమయంలోనే కాకుండా ఏడాది పొడవునా పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలనిసూచించారు. నేటి తరం పిల్లలకు ప్రకృతి ప్రాధాన్యతను తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని సంతోష్ రావు అన్నారు. పండుగల సందర్భంగా పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాల గురించివివరించడంతోపాటు చెట్లు, పూలు, నీరు, నేల, గాలి వంటి ప్రకృతి వనరుల విలువను తెలియజేయాలని సూచించారు. ప్రకృతిని ప్రేమించే మనస్తత్వం చిన్నతనం నుంచే అలవడితే పర్యావరణాన్ని కాపాడే బాధ్యతాయుతమైన పౌరులు తయారవుతారని పేర్కొన్నారు. అలాగే, పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్క ప్రభుత్వానికో, కొన్ని సంస్థలకో పరిమితమైన బాధ్యత కాదని, ఇది సమాజంలోని ప్రతి ఒక్కరి కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం నుంచి గ్రామాలు, పట్టణాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం వరకు ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. పండుగల సందర్భంగా పూలు, ఆకులు, ఇతర సహజ వనరులను వినియోగించినప్పుడు వాటిని బాధ్యతాయుతంగా నిర్వహించాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బతుకమ్మ మనకు ప్రకృతిని ప్రేమించడం నేర్పిస్తే, విజయదశమి ధర్మం, న్యాయం, మంచితనం వైపు నిలబడాలని సందేశమిస్తుందని సంతోష్ రావు పేర్కొన్నారు. ఈ రెండు పండుగల స్ఫూర్తిని మన జీవితాల్లో ఆచరణలో పెట్టినప్పుడే వాటి అసలైన పరమార్థం నెరవేరుతుందని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం అంటే మన ఆరోగ్యాన్ని, మన భవిష్యత్తును, రాబోయే తరాల జీవనాన్ని కాపాడుకోవడమేనని తెలిపారు. ప్రకృతిని ఆరాధిద్దాం.. పచ్చదనాన్ని పెంపొందిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. సంప్రదాయాల స్ఫూర్తితో సమాజ శ్రేయస్సుకు పాటుపడదాం అని పిలుపునిచ్చారు. బతుకమ్మ, విజయదశమి పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకుంటూనే ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని, పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకుని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

అయ్యప్ప స్వాములు మనకు ఆదర్శం

– షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్
– అంజి యాదవ్ ఏడవ మహా పాదయాత్ర ప్రారంభం

నందిగామ అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : నందిగామ: ఆధ్యాత్మిక క్రమశిక్షణను ప్రపంచానికి పరిచయం చేస్తూ, భక్తి మార్గంలో అందరినీ ఆదర్శవంతంగా ముందుకు నడిపిస్తున్న అయ్యప్ప స్వాముల తీరు ఆదర్శనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప భక్తుడు అంజి యాదవ్ శబరిమలైకి చేపట్టిన ఏడవ మహా పాదయాత్రను ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. అంజి యాదవ్ ఆధ్వర్యంలో 21 మంది అయ్యప్ప స్వాములు శబరిమలై యాత్రకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యనిష్ట, భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మాల ధారణ చేసి నియమ నిష్టలను పాటిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పాదయాత్ర ద్వారా అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు బయలుదేరిన భక్తుల సంకల్పం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అయ్యప్ప స్వాముల యాత్ర విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ భక్తులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, గిరిజన, ఆదివాసీ కోఆర్డినేటర్ పి. రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, ఫరూక్‌నగర్ మండల చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, చైర్మన్ అంబటి ప్రభాకర్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు జంగా నరసింహులు యాదవ్, లక్ష్మయ్య, స్థానిక సర్పంచ్ కొమ్ము కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కుమార్ గౌడ్, ఎస్సీ సెల్ తాలూకా చైర్మన్ జాంగారి రవి, దళిత నాయకుడు కేకే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేచురల్ డైమండ్ బ్రాండ్ జూరి ప్రారంభం

– రాబోయే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 25 స్టోర్ల ఏర్పాటు లక్ష్యం

శేరిలింగంపల్లి,అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి): వజ్రాభరణాలకు ప్రసిద్ధి చెందిన నేచురల్ డైమండ్ జ్యువెలరీ బ్రాండ్ 'జూరి' మొట్టమొదటి రిటైల్ అవుట్లెట్ను రాజ్ భవన్ రోడ్లో వ్యవస్థాపకులు సాయి వినీత్,మహేష్ చౌదరి, అంకుష్ సురానా ప్రారంభించారు. ఈ సందర్భంగా జూరి వ్యవస్థాపకుడు మహేష్ చౌదరి మాట్లాడుతూ... రాబోయే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 25 స్టోర్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.ఇందులో భాగంగా రాబోయే మూడు నెలల్లో హైదరాబాద్లో నాలుగు అవుట్లెట్లను ప్రారంభించనున్నామని చెప్పారు. వినియోగదారుల ఆకాంక్షలు, ప్రాధాన్యతలను ప్రతిబింబించేలా ఈ షోరూమ్ను రూపొందించామన్నారు. ఇందులో వీఐపీ లాంజ్ కూడా ఉందన్నారు.రిటైల్ నెట్వర్క్ను విస్తరిస్తున్న క్రమంలో రాబోయే అవుట్లెట్లలో కూడా ఇదే డిజైన్ విధానాన్ని కొనసాగిస్తామన్నారు. జూరి ఫ్యాషన్ జ్యువెలరీ నిత్య జీవితం కోసం రూపొందించబడిందని చెప్పారు. ట్రెండీ, సమకాలీన డిజైన్లతో పాటు బహుముఖ వినియోగానికి అనువుగా ఉంటాయన్నారు. ఆఫీస్ పని, వ్యాయామం, డిన్నర్లు, సినిమా నైట్లు ఇలా ప్రతి సందర్భానికి, జీవనశైలికి మా ఆభరణాలు చక్కగా సరిపోతాయని తెలిపారు. ఇది మొట్టమొదటి రిటైల్ అవుట్లెట్ అన్నారు. రాబోయే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 25 స్టోర్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. కస్టమర్లే ప్రథమ ప్రాధాన్యతగా యువతరం కోసం తేలికపాటి, సమకాలీన డిజైన్లతో ఈ బ్రాండ్ రిటైల్ రంగంలోకి అడుగు పెట్టిందన్నారు.ఈ సందర్భంగా జూరి వ్యవస్థాపకుడు సాయి వినీత్ మాట్లాడుతూ భారతీయ ఆభరణాల మార్కెట్లో వినియోగదారుల ప్రాధాన్యతలు మారుతున్న తరుణంలో 'జూరి' విస్తరణ ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. పెళ్లిళ్లు, ప్రత్యేక వేడుకల కోసం కొనుగోలు చేసే సంప్రదాయ ఆభరణాలతో పాటు రోజువారీ వినియోగానికి అనువైన బహుముఖ, తేలికపాటి డిజైన్ల పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. సహజ సిద్ధమైన వజ్రాలు, సమకాలీన ఆకర్షణీయమైన డిజైన్లు, పారదర్శకమైన, కస్టమర్-కేంద్రీకృత రిటైల్ అనుభవం ద్వారా ప్రీమియం 'ఎవ్రీడే లగ్జరీ'ని అందిస్తూ ఈ మార్పును అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. కేవలం కొనుగోలు చేసే ఉత్పత్తుల కోసమే కాకుండా, మాతో పొందే అనుభూతి, ఏర్పడే బంధం ద్వారా కస్టమర్ల విశ్వాసాన్ని చూరగొనే జ్యువెలరీ బ్రాండ్ను నిర్మించడమే మా లక్ష్యమన్నారు. నాణ్యత, సమకాలీన డిజైన్, పారదర్శకతను వినియోగదారులకు ఉపయోగపడే ప్రయోజనాలతో మిళితం చేస్తూ సహజ సిద్ధమైన డైమండ్ ఆభరణాలను రోజువారీ జీవితంలో అంతర్భాగం చేయడంపై దృష్టి సారిస్తున్నామన్నారు. రెండో స్టోర్ దీపావళికి ముందే కొంపల్లిలో ప్రారంభించనున్నామన్నారు. ఆ తర్వాత హైదరాబాద్ అంతటా, దేశవ్యాప్తంగా విస్తరించాలని యోచిస్తున్నామన్నారు. జూరి అనేది సాంప్రదాయ ఆభరణాలకు అతీతమైన ఒక ఫ్యాషన్ జ్యువెలరీ బ్రాండ్ అన్నారు. మారుతున్న ట్రెండ్లు, జీవనశైలి, భావోద్వేగాలను ప్రతిబింబిస్తూ ఆభరణాలను రోజువారీ వ్యక్తిత్వ వ్యక్తీకరణగా మార్చే సమకాలీన డిజైన్లను అందిస్తున్నామని తెలిపారు. రూ.10,000 నుంచి రూ.5 లక్షల వరకు ఉత్పత్తులతో తేలికపాటి, ఫ్యాషనబుల్ ఆభరణాలను ఇష్టపడే యువతరాన్ని ప్రధానంగా ఆకట్టుకుంటున్నామని చెప్పారు.

దుర్గామాత ఆలయములో ప్రత్యేక పూజలు నిర్వహించిన కొమిరిశెట్టి సాయిబాబా

శేరిలింగంపల్లి, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) : రాజేంద్ర నగర్ నియోజకవర్గం మణికొండ గ్రామం ఓయూ కాలనీలోని దుర్గామాత ఆలయంలో 8వ రోజు నవరాత్రి ప్రత్యేక పూజలు.రాజేంద్ర నగర్ నియోజకవర్గం మణికొండ గ్రామం ఓయూ కాలనీలోని దుర్గామాత ఆలయంలో నవరాత్రుల 8వ రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.

ఈ పూజా కార్యక్రమానికి శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రజలను ఆరోగ్యంగా సుఖసంతోషాలతో చూడాలని అమ్మవారిని కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సాయిబాబా ని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రవణ్ కుమార్,అశోక్ యాదవ్ స్థానిక నాయకులు,భక్తులు, తదితరులు పాల్గొన్నారు

అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించాలి

జయంతి పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉత్సవ కమిటీ సభ్యులు.. రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజులు, బహుజనులు పాల్గొనాలని పిలుపు

పరిగి, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి): తెలంగాణ రాబిన్‌హుడ్‌గా, సామాజిక ఉద్యమ నేతగా, ప్రజావీరుడిగా గుర్తింపు పొందిన పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతిని అక్టోబర్ 22న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పండుగ సాయన్న జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. జయంతి సందర్భంగా పరిగి పట్టణంలోని పండుగ సాయన్న విగ్రహ ప్రాంగణంలో జయంతి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

తెలంగాణ ప్రభుత్వం పండుగ సాయన్న జయంతిని అక్టోబర్ 22న అధికారికంగా నిర్వహించాలని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే అధికారిక కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజులు, బహుజనులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రతి గ్రామం, మండలం, జిల్లా స్థాయిలో జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించి, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు ముకుంద నాగేశ్వర్, పరిగి పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దోమ శ్రీశైలం ముదిరాజ్, జిల్లా కార్యదర్శి దేశమోని మాణిక్యం ముదిరాజ్, నియోజకవర్గ అధ్యక్షుడు రామస్వామి ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ ముదిరాజ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటయ్య ముదిరాజ్, జర్నలిస్టు ఆంజనేయులు ముదిరాజ్, బిచ్చన్న ముదిరాజ్, హనుమంతు ముదిరాజ్, ఆనంద్ గౌడ్, ప్రకాష్ ముదిరాజ్, లక్ష్మణ్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, నారాయణ ముదిరాజ్, ఆకుల సత్యనారాయణ ముదిరాజ్, దోమ ప్రవీణ్ ముదిరాజ్, దోమ శ్రీనివాస్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దసరా రావణ దహన ఏర్పాట్ల పరిశీలన

వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించిన ఉత్సవ కమిటీ సభ్యులు

పరిగి, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి): పరిగి మున్సిపాలిటీ పరిధిలో దసరా సందర్భంగా నిర్వహించనున్న రావణ దహన కార్యక్రమానికి సంబంధించి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం వద్ద చేపట్టిన ఏర్పాట్లను హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు పరిశీలించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ముకుంద నాగేశ్వర్, వార్డు కౌన్సిలర్ మల్కాపూర్ భాస్కర్, దేవాలయ దేవాదాయ కమిటీ సభ్యుడు ఎర్రగడ్డపల్లి గోపాల్, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, శ్రీశైలం, రాజేష్, నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జాతీయ అవార్డుకు నీరటి నర్సింహులు ఎంపిక

నవంబర్ 15న న్యూఢిల్లీలో అవార్డు ప్రదానం.. నర్సింహులుకు ఉపాధ్యాయుల అభినందనలు

పరిగి, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తూ, సమాజంలో సామాజిక చైతన్యం, విజ్ఞానాన్ని పెంపొందిస్తున్న రూప్‌ఖాన్‌పేట్‌కు చెందిన నీరటి నర్సింహులు ప్రతిష్ఠాత్మక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు--2026' కు ఎంపికయ్యారు. ఈయన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విజ్ఞాన వేదిక పరిగి నియోజకవర్గ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.

బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డుల ఎంపిక కమిటీ ఈ విషయాన్ని ప్రకటించింది. హైదరాబాద్‌లోని నాచారం భవానీనగర్‌లో ఉన్న అకాడమీ జాతీయ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా నీరటి నర్సింహులు అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల హక్కుల పరిరక్షణ, సాహిత్య వికాసం, సామాజిక సేవకు కృషి చేస్తున్న ఉద్యమకారులు, సంఘసేవకులు, రచయితలకు ఏటా ఈ అవార్డులను అందజేస్తున్నట్లు నల్లా రాధాకృష్ణ తెలిపారు. నవంబర్ 15న న్యూఢిల్లీలోని కరోల్‌బాగ్‌లో నిర్వహించనున్న బహుజన సాహిత్య అకాడమీ 20వ జాతీయ మహాసభల్లో దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి హాజరయ్యే ప్రతినిధుల సమక్షంలో నర్సింహులుకు అవార్డును ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

కాగా, పరిగి మండలం మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న నీరటి నర్సింహులు జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. ఉస్మాన్ అలీ, ఉపాధ్యాయులు ఏ. కృష్ణయ్య, రాజు, కవిత హర్షం వ్యక్తం చేశారు. పూలే, అంబేద్కర్ ఆశయాల సాధనకు, సమాజంలో సామాజిక స్పృహను పెంపొందించేందుకు కృషి చేస్తున్న నర్సింహులుకు అవార్డు రావడం సంతోషకరమని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టేకి రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి కనుకుంట విజయ్ కుమార్, అవార్డు ఎంపిక కమిటీ సభ్యుడు మోత్కూరి పెద్ద అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. నర్సింహులుకు అవార్డు రావడంపై పరిగి నియోజకవర్గ ప్రజలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

గులాబీ గూటికి.. పెంజర్ల వాసులు

– యువకుల రాకతో కొత్తూరు మండలంలో కొత్త జోష్
– ఉపసర్పంచ్ మామిడి శంతన్ రెడ్డి,మరో ఎనిమిది మంది వార్డు సభ్యులతో యువకులు సుమారు 100 మంది చేరిక
– ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కండువా కప్పి పార్టీలో ఆహ్వానం

కొత్తూరు అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి) : కొత్తూరు మండల రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది.పార్టీల్లో చేరికలు, నాయకుల మంతనాలు, గ్రామస్థాయి రాజకీయ సమీకరణాలు కొత్త చర్చకు తెరలేపుతున్నాయి.ముఖ్యంగా పెంజర్ల గ్రామానికి చెందిన పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు ఆదివారం కాంగ్రెస్,ఇతర పార్టీని వీడి బీఆర్ఎస్‌లోకి చేరడంతో రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది!

పెంజర్ల నుంచి.. గులాబీ గూటికి..:

ఇప్పటి వరకు కాంగ్రెస్,ఇతర పార్టీలతో కలిసి కొనసాగిన స్థానిక ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ వైపు అడుగులు వేశారు.దీంతో గ్రామ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. యువకుల కోరిక మేరకు ఉపసర్పంచ్ మామిడి శాంతన్ రెడ్డి,మరో ఎనిమిది మంది వార్డు సభ్యులతో సుమారు 100 మంది బీఆర్ఎస్‌లో పార్టీ గూటికి చేరారు.ఈ చేరిక కార్యక్రమం ఎమ్మెల్సీ నాగరి కుంట నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా కొనసాగింది.ఉపసర్పంచ్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు ఒకేసారి పార్టీ మారడంతో గ్రామస్థాయిలో రాజకీయ లెక్కలు మారే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నవీన్ రెడ్డి స్వగృహంలో.. భారీ చేరికల సందడి..! :

ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి స్వగృహం మొదల్లగూడలో చేరిక కార్యక్రమం ఘనంగా బిఆర్ఎస్ పార్టీలోకి చేరికల వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కొత్తూరు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు,కార్యకర్తలు భారీగా తరలిరావడంతో కొత్తూరు గులాబీ మయంగా మారింది.అదే విదంగా పెంజర్ల గ్రామం నుంచి భారీ కాన్వాయ్‌తో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి స్వగృహంమునకు తరలిరావడంతో కొత్తూరు మండలంలో గులాబీ.. గర్జన వాతావరణం చోటుచేసుకుంది.

గులాబీ పార్టీలో చేరిన వారు : ఉప సర్పంచ్ శంతన్ రెడ్డి,వార్డ్ సభ్యులు వేదంతా చారి,ఎస్.కె అర్బాస్,మంద మాధవి శ్రీను,ఆకనపల్లి మాధవి సహదేవ్,రాముట్ల రాములు, మైబుజ్జి,రమాదేవి శేఖర్, యువకులు మంద శ్రీనివాస్,వనం జంగయ్య, పోచమోని శంకర్, రాముట్ల రాములు,దిమూల ప్రవీణ్,ఆకన్పల్లి శివ,పలుకుట శ్రీను, బురమోని రమేష్,బురిగల్ల ప్రశాంత్(నాని),తెలుగు మహేందర్, వెంకటాపురం అశోక్,కోట బీరయ్య,కుమ్మరి జంగయ్య,షేక్ జాంగిర్, షేక్ అఫ్రోజ్, షేక్ కాజా పాషా, ఎర్రోళ్ల నరసింహ, ఎర్రోళ్ల ప్రశాంత్, గూడబ్ రాజేష్, ఇద్రపల్లి శేఖర్,లింగారి సత్తిపాల్, మంగలి పవన్, కమ్మరి రాజు, కావలి నాని,ఇంద్రపల్లి శ్రీధర్, మంద జస్వంత్,మంద విష్ణువర్ధన్,ఈర్లపల్లి శ్రీధర్,రాముట్ల కార్తీక్, లుంగారి నాని,ఆకంపల్లి జై కిషోర్,దేశాల సురేష్,ఇక్కలగారి వినీత్, తలారి నాని,ఈర్లపల్లి శ్రీశైలం తదితరులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బ్యాగరి రాజు,విలేజ్ వైస్ ప్రెసిడెంట్ కొరట్ల రాములు, పోచయ్య,యువ నాయకుడు శివ చారి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ బోయిన్‌పల్లిలో దాండియా వేడుకల్లో పాల్గొన్న జక్కుల మహేశ్వర్ రెడ్డి

బోయిన్‌పల్లి, అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా న్యూ బోయిన్‌పల్లి వార్డు--1లోని ప్రొఫెసర్ జయ సర్ విగ్రహం వద్ద నిర్వహించిన దాండియా వేడుకల్లో జక్కుల మహే శ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన దాండియా నృత్యంలో పాల్గొని ఉత్సవాల్లో సం దడి చేశారు. సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. స్థానికులు, యువత, మహిళలు పాల్గొని దాండియా వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.

కరణ్ కోట్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన అన్వేష్ రెడ్డి

తాండూరు అక్టోబర్ 18 ప్రజా జ్యోతి : తాండూర్ మండలం కరణ్ కోట్ నూతన ఎస్ఐగా అన్వేష్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఎస్ఐగా విధులు నిర్వహించిన రాథోడ్ వినోద్ బదిలీపై వెళ్లడంతో ఆస్థానంలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 20న జరుపుకునే దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శాంతియుతంగా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అదేవిధంగా శాంతి భద్రతల విషయంలో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా అందరూ సహకరించాలని ఆయన కోరారు.

కోటపల్లి నూతన ఎస్ఐగా మీనాక్షి

కోటపల్లి అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి) : కోటపల్లి మండల నూతన ఎస్ఐగా మీనాక్షి ఆదివారం రోజున బాధ్యతలు చేపట్టారు.ఇంతకు ముందు ఎస్ఐగా విధులు నిర్వహించిన శైలజ బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టినట్లు ఆమె చెప్పారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మండల ప్రజలు సహకరించాలని కోరారు,దసరా నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.అదేవిధంగా శాంతి భద్రతలు మరియు అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా అందరూ సహకరించాలని నూతన ఎస్ఐ కోరారు.

అమ్మవారి ఆశీస్సులతో అందరికీ విజయం లభించాలి

– కోటమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

నందిగామ, అక్టోబర్ 18(ప్రజాజ్యోతి) : షాద్‌నగర్ పట్టణంలోని రైతు కాలనీలో గల కోటమైసమ్మ ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి ఆదివారం సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరికీ విజయం లభించాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించే పూజలు ప్రజలకు ఆధ్యాత్మిక ఆనందాన్ని, సంతోషాన్ని అందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో విజ యాలు, సుఖసంతోషాలు నింపాలని అమ్మవారిని ప్రార్థిం చినట్లు పేర్కొన్నారు. అనంతరం తన స్వగ్రామమైన ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామంలో నిర్వహించిన అమ్మవారి వేడుకల్లోనూ ఆయన పాల్గొన్నారు. గ్రామ ప్రజలందరిపై అమ్మవారి కృపాకటాక్షాలు ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసం తోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, కౌన్సిలర్ మురళీమోహన్ (అప్పి), రైతు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జర్నలిస్టు కేపీ, శుక్ర వర్ధన్ రెడ్డి, చెరుకు శివ, విజయ రాములు గౌడ్, డాక్టర్ బుచ్చయ్య, నారాయణరెడ్డి, గోపాలరెడ్డి, జర్నలిస్టులు రంగనాథ్, శరత్, రాఘవేందర్ గౌడ్, సాయినాథ్ రెడ్డి, శివ, పిప శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వై. అనూప్ రావు చొరవతో అభివృద్ధికి ఎంపీ నిధులు

పూదోట మల్లన్న ఆలయం, ఎకిన్‌పూర్ రజక సంఘ భవనానికి రూ.6 లక్షలు మంజూరు

కోరుట్ల, అక్టోబర్ 18 ప్రజాజ్యోతి:
కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వై. అనూప్ రావు చొరవతో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ నిధుల నుంచి రెండు అభివృద్ధి పనులకు రూ.6 లక్షలు మంజూరయ్యాయి.

కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలోని పూదోట మల్లన్న స్వామి ఆలయానికి పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.3 లక్షలు, కోరుట్ల పట్టణంలోని ఎకిన్‌పూర్ రజక సంఘ భవన అభివృద్ధికి రూ.3 లక్షలు కేటాయించారు.ఈ నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను డాక్టర్ వై. అనూప్ రావు, బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు లు అందజేశారు. ప్రజల అవసరాలను గుర్తించి ఆలయ అభివృద్ధికి, రజక సంఘ భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించడంలో చొరవ చూపిన డాక్టర్ అనూప్ రావుకు ఆలయ కమిటీ సభ్యులు, రజక సంఘ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో వైభవంగా దుర్గమ్మ నవరాత్రి వేడుకలు

అమ్మవారిని దర్శించుకున్న డాక్టర్ గురువారెడ్డి, శైలేందర్‌రెడ్డి

ఎండపల్లి, అక్టోబరు 18 (ప్రజాజ్యోతి):
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో దుర్గాశరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం రాష్ట్ర ఐఎంఏ ఉపాధ్యక్షుడు, జగిత్యాల ప్రముఖ వైద్యుడు డాక్టర్ డి. గురువారెడ్డి, వెల్గటూర్ మండల

కాంగ్రెస్ అధ్యక్షుడు, పీసీసీ కార్యవర్గ సభ్యుడు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని ప్రార్థిస్తూ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఆనందాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తనుగుల విజయ్, తో పాటు మన్నే జితేందర్, దేవేందర్, సత్తయ్య, శ్రీనివాస్, శ్రీహరి, రూపేష్, పవన్, శ్రీనాథ్, స్వాములు, లెజెండ్ యూత్ సభ్యులు, మాల సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దలింగాపూర్ గ్రామపంచాయితి సిబ్బందికి నగదు పంపిణీ చేసిన గొడిశెల జితెందర్ గౌడ్

ఇల్లంతకుంట అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి) :
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ గొడిశెల జితెందర్ గౌడ్ ఆదివారం రోజు గ్రామపంచాయితి సిబ్బందికి తలా

1,000/-రూ!!చొప్పన 7,000 రూపాయల నగదు పంఫణీ చేసారు ఈ సందర్భంగా జితెందర్ గౌడ్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు చిత్తశుద్ధితో తమ బాధ్యతలను నర్వహిస్తున్నారని ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. పారిశుధ్య కార్మికులు తమ బాధ్యతలను చక్కగా నిర్వహించడం గర్వకారణమని వారి సేవలకు తన వంతు సహాయంగా కొంత నగదు ను అందజేయడం సంతోషంగా ఉందని అన్నారు.వారికి ఎల్లప్పుడు అందుబాటలో ఉంటూ అన్ని రకాలుగా సహయ సహకారాలు అందిస్తానని అన్నారు.గ్రామపంచాయతీ సిబ్బందికి నగదు సహాయం అందజేసిన జితేందర్ గౌడుకి సిబ్బంది కృతజ్యతలు తెలియజేసారు

దురుసుగా ప్రవర్తించిన హెడ్ కానిస్టేబుల్

ఆకరణంగా చేయి చేసుకున్నాడంటూ ఫిర్యాదు

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి అక్టోబర్ 17 (ప్రజాజ్యోతి):
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు వంగల రాజు రెడ్డి శనివారం రాత్రి సుమారు 10 గంటలకు రాజిరెడ్డి బిజెపి పార్టీ అమ్మవారి బతుకమ్మ దసరా శుభాకాంక్షలు ఫ్లెక్సీ ని తీసుకెళ్తుండగా ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న షబ్బీర్ పాషా అనే కానిస్టేబుల్ మద్యం సేవించి దురుసుగా ప్రవర్తిస్తూ దురుసు పదజాలంతో అతనిపై చేయి చేసుకొని కొట్టడం జరిగిందని,మద్యం సేవించాడు అంటూ స్టేషన్కు తీసుకెళ్లి మద్యం టెస్టు నిర్వహిస్తే రాజిరెడ్డి మద్యం తాగలేదని తెలిపోయింది మద్యం మత్తులో దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్ ను వెంటనే సస్పెండ్ చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి,మండల అధ్యక్షులు రేపాక రామచంద్ర రెడ్డి డిమాండ్ చేశారు స్పందించిన సిఐ విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు అయితే సదరు కానిస్టేబుల్ లు హెడ్ ఆఫీస్ కి అటాచ్ చేశామని సి ఐ వెంకటేష్ తెలిపారు

బియ్యం ధరలకు రెక్కలు.. సామాన్యుడి బతుకుకు భారం?

పెరిగిన బియ్యం ధరలతో మధ్యతరగతి కుటుంబాల విలవిల

నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో కుదేలవుతున్న కుటుంబ బడ్జెట్..

నెలవారీ ఖర్చులు ఎలా భరించాలంటూ ఆందోళన!

కోరుట్ల, అక్టోబర్ 18 ప్రజాజ్యోతి:

పూట గడవాలంటేనే కష్టాలు!
భారతీయుల ఆహారంలో బియ్యానికి ప్రత్యేక స్థానం ఉంది. పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా లేకుండా అనేక కుటుంబాల్లో బియ్యం ప్రధాన ఆహారంగా ఉంది. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో అన్నం రోజువారీ ఆహారంలో కీలకంగా ఉంటుంది. అలాంటి బియ్యం ధరలు పెరిగితే దాని ప్రభావం నేరుగా ప్రతి ఇంటి వంటగదిపై పడుతోంది.గతంలో నెలకు సరిపడా బియ్యం కొనుగోలు చేసేందుకు ఒక నిర్దిష్ట మొత్తాన్ని కేటాయించుకునే కుటుంబాలు, ప్రస్తుతం ధరల పెరుగుదల కారణంగా తమ బడ్జెట్‌ను తిరిగి లెక్కించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి నెలకు ఎక్కువ మొత్తంలో బియ్యం అవసరమయ్యే కుటుంబాలకు ఈ భారం మరింత ఎక్కువగా ఉంటోంది. రోజువారీ కూలీపై ఆధారపడే కార్మికులు, చిరుద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, చిన్న వ్యాపారులు పెరుగుతున్న ఖర్చులతో సతమతమవుతున్నారు.

రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు సామాన్య ప్రజలకు భారంగా మారుతున్నాయి. ముఖ్యంగా ప్రతి ఇంట్లో ప్రతిరోజూ వినియోగించే బియ్యం ధరలు పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఇప్పటికే కూరగాయలు, పప్పులు, వంట నూనె, పాలు, గ్యాస్ వంటి నిత్యావసరాల ఖర్చులతో సతమతమవుతున్న కుటుంబాలకు బియ్యం ధరల పెరుగుదల మరింత భారంగా మారింది. నెలవారీ ఆదాయంలో అధిక భాగం ఆహార పదార్థాల కొనుగోలుకే వెచ్చించాల్సి రావడంతో ఇతర అవసరాలకు డబ్బులు సరిపోక కుటుంబ పెద్దలు ఆందోళన చెందుతున్నారు.

ఒకవైపు ఆదాయం పరిమితం.. మరోవైపు ధరల భారం!:
మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. నెలవారీ జీతాలు, ఆదాయాలు పరిమితంగానే ఉంటుండగా నిత్యావసరాల ధరలు మాత్రం కుటుంబ బడ్జెట్‌పై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇంటి అద్దె, పిల్లల చదువులు, విద్యుత్ బిల్లులు, వైద్య ఖర్చులు, ప్రయాణ

ఖర్చులు వంటి అవసరాలన్నింటినీ తీర్చిన తర్వాత మిగిలే మొత్తంతోనే నెలంతా కుటుంబాన్ని నెట్టుకు రావాల్సి వస్తోంది.ఇలాంటి పరిస్థితుల్లో బియ్యం ధరలు పెరగడం కుటుంబాల ఆర్థిక సమతుల్యతను దెబ్బతీస్తోంది. గతంలో ఇతర అవసరాల కోసం కొంత మొత్తాన్ని పొదుపు చేసుకునే కుటుంబాలు ఇప్పుడు ఆ మొత్తాన్ని కూడా సరుకుల కొనుగోలుకే వెచ్చించాల్సి వస్తోంది. అనుకోని వైద్య ఖర్చులు వచ్చినా, పిల్లల విద్యకు అదనపు డబ్బు అవసరమైనా అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు మధ్యతరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సరుకుల ధరలతో సతమతం.. వంటగది బడ్జెట్ తలకిందులు!:
బియ్యం ధరల పెరుగుదల ఒక్కటే సమస్య కాదు. ఇతర నిత్యావసర సరుకుల ధరలు కూడా కుటుంబాల ఖర్చులను ప్రభావితం చేస్తున్నాయి. కూరగాయల ధరలు మారుతూ ఉండటం, పప్పులు, వంట నూనెల కొనుగోలుకు అధికంగా ఖర్చు చేయాల్సి రావడం, పాలు, ఇతర ఆహార పదార్థాల ధరలు కుటుంబ బడ్జెట్‌ను మరింత భారంగా మారుస్తున్నాయి.
ప్రతి నెలా సరుకుల దుకాణానికి వెళ్లినప్పుడు గతంలో కొనుగోలు చేసిన పరిమాణంలోనే సరుకులు తీసుకున్నా బిల్లు మాత్రం ఎక్కువగా వస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. ముఖ్యంగా నలుగురు లేదా ఐదుగురు సభ్యులు ఉన్న కుటుంబాల్లో బియ్యం వినియోగం ఎక్కువగా ఉంటుంది. అలాంటి కుటుంబాలకు బియ్యం ధరల్లో స్వల్ప పెరుగుదల కూడా నెలవారీ ఖర్చులపై గణనీయమైన ప్రభావం చూపుతుంది.పెరుగుతున్న ఖర్చులను తగ్గించుకునేందుకు కొన్ని కుటుంబాలు ఇతర సరుకుల కొనుగోళ్లను పరిమితం చేసుకోవాల్సి వస్తోంది. మరికొన్ని కుటుంబాలు అవసరమైన వస్తువులను ఒకేసారి కొనుగోలు చేయకుండా విడతలవారీగా కొనుగోలు చేస్తున్నాయి. మరికొందరు బయట ఆహారం తీసుకోవడం, అనవసర ఖర్చులు చేయడం పూర్తిగా తగ్గించుకుంటున్నారు. అయినప్పటికీ నెలాఖరుకు చేతిలో డబ్బులు మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మధ్యతరగతి కుటుంబాలపై పెరుగుతున్న ఒత్తిడి!:
సమాజంలో మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి ప్రత్యేకంగా చర్చించాల్సిన అంశంగా మారుతోంది. ప్రభుత్వ పథకాల ద్వారా కొంతమేర లబ్ధి పొందే కుటుంబాలు ఉన్నప్పటికీ, ఆదాయ పరిమితుల కారణంగా అనేక కుటుంబాలు తమ అవసరాలన్నింటినీ సొంత ఆదాయంతోనే తీర్చుకోవాల్సి వస్తోంది. ఆదాయం పెరిగే వేగం కంటే ఖర్చులు పెరిగే వేగం ఎక్కువగా ఉందనే భావన వారిలో ఆందోళన కలిగిస్తోంది.పిల్లలకు మంచి విద్య అందించాలి, కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించాలి, భవిష్యత్తు కోసం కొంత పొదుపు చేసుకోవాలి అనే ఆశయాలతో జీవించే మధ్యతరగతి కుటుంబాలకు నిత్యావసరాల ధరల పెరుగుదల అడ్డంకిగా మారుతోంది. ముఖ్యంగా కుటుంబంలో సంపాదించే వ్యక్తి ఒక్కరే ఉన్నప్పుడు ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది.నెలవారీ బడ్జెట్‌లో ఆహార ఖర్చుల వాటా పెరిగిపోవడంతో పిల్లల చదువులు, ఆరోగ్యం, ఇతర అవసరాలకు కేటాయించే మొత్తాన్ని తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ధరల పెరుగుదల ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో కుటుంబాల పొదుపుపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌లో ధరలపై పర్యవేక్షణ అవసరం!:
బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? ధాన్యం ఉత్పత్తి, మిల్లింగ్ ఖర్చులు, రవాణా వ్యయం, నిల్వ పరిస్థితులు, మార్కెట్‌లో డిమాండ్–సరఫరా వంటి అంశాలు ధరలపై ప్రభావం చూపుతాయి. అయితే స్థానిక మార్కెట్‌లో ఏ రకం బియ్యం ధరలు ఎంత మేరకు పెరిగాయి? హోల్‌సేల్, రిటైల్ ధరల మధ్య ఎంత వ్యత్యాసం ఉంది? అనే అంశాలపై స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉండటం అవసరం.వినియోగదారులకు అందుబాటులో ఉండే ధరలకు నాణ్యమైన బియ్యం లభించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బియ్యం ధరల విషయంలో మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు, అక్రమ నిల్వలు లేదా అన్యాయమైన ధరల వసూళ్లు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడుతున్నారు. అలాగే రేషన్ దుకాణాల ద్వారా అర్హులైన కుటుంబాలకు అందుతున్న బియ్యం సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి!:
నిత్యావసరాల ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవన ప్రమాణాలపై ప్రభావం చూపకుండా ప్రభుత్వ యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా బియ్యం ధరలపై మార్కెట్ పరిస్థితులను సమీక్షిస్తూ వినియోగదారులకు సరసమైన ధరలకు సరుకులు అందుబాటులో ఉండేలా చూడాలి.స్థానికంగా బియ్యం విక్రయించే దుకాణాల్లో వివిధ రకాల బియ్యం ధరలను ప్రదర్శించడం, వినియోగదారులకు సరైన తూకంతో సరుకులు అందించడం, ధరల విషయంలో పారదర్శకత పాటించడం వంటి చర్యలు ఉపయోగకరంగా ఉంటాయి. ధరల పెరుగుదలకు గల కారణాలను సంబంధిత శాఖలు పరిశీలించి, అవసరమైన చోట తగిన చర్యలు తీసుకోవడం ద్వారా వినియోగదారులపై పడే భారాన్ని కొంతవరకు తగ్గించవచ్చు.

సామాన్యుడి ప్రశ్న ఒక్కటే.. కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలి?:
బియ్యం ధరల పెరుగుదల అనేది కేవలం మార్కెట్‌కు సంబంధించిన అంశం మాత్రమే కాదు. అది ప్రతి కుటుంబం రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే సమస్య. అన్నం ప్రతి ఇంటి అవసరం కావడంతో బియ్యం ధరల్లో మార్పులు నేరుగా ప్రజల జీవన వ్యయంపై ప్రభావం చూపుతాయి.
పరిమిత ఆదాయంతో కుటుంబాన్ని పోషించే వ్యక్తికి ప్రతి రూపాయి విలువైనదే. అలాంటి పరిస్థితుల్లో నిత్యావసరాల ధరలు పెరిగితే కుటుంబ అవసరాల మధ్య రాజీ పడాల్సి వస్తుంది. పిల్లల అవసరాలను తగ్గించాలా? ఆరోగ్య ఖర్చులను వాయిదా వేయాలా? లేక అప్పులు చేయాలా? అనే ప్రశ్నలు కుటుంబ పెద్దలను వేధిస్తున్నాయి.ప్రజలకు అందుబాటులో ఉండే ధరలకు నిత్యావసర సరుకులు లభించినప్పుడే కుటుంబాల ఆర్థిక పరిస్థితి కొంత మెరుగుపడుతుంది. అందువల్ల బియ్యం ధరల పెరుగుదలకు గల కారణాలను పరిశీలించి, ధరల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని మధ్యతరగతి కుటుంబాలు కోరుతున్నాయి.బియ్యం ధరలు సామాన్యుడి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం, నిత్యావసరాల మార్కెట్‌పై పర్యవేక్షణ పెంచడం, అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సహాయం సక్రమంగా అందించడం ప్రస్తుత పరిస్థితుల్లో కీలకంగా మారాయి. అప్పుడే సామాన్యుడి ఇంట్లో అన్నం ఉడకడమే కాకుండా, కుటుంబ బడ్జెట్ కూడా గాడిలో పడే అవకాశం ఉంటుంది.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

– ఈ నెల 23న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

బీజేపీ మండల అధ్యక్షుడు నాగం శివకుమార్ పిలుపు

భీమారం, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి):
రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ భీమారం మండల అధ్యక్షుడు నాగం శివకుమార్ పిలుపునిచ్చారు. భీమారం మండల

కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ మండల కార్యశాలకు ముఖ్య అతిథిగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కో–కన్వీనర్ క్యాతం దశరథ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగం శివకుమార్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరా కాకపోవడం, సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 23న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం చేస్తుందని తెలిపారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన రెబ్బాస్ మల్లయ్యను నాగం శివకుమార్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముంజ శ్రీనివాస్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు అన్నాడి జలపాతి రెడ్డి, ఉపాధ్యక్షుడు గోపు సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వంశీ, సర్పంచులు లచ్చయ్య, లింగం గౌడ్, సీనియర్ నాయకులు లింగారెడ్డి, పవన్, ప్రసాద్, సంతోష్, మహేష్, జలపాతి రెడ్డి, సత్యపాల్, మల్లేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్‌కు ఎంపికైన వంశీకకు ఘన సన్మానం

వంశీకకు అండగా ఉంటా.. క్రీడల్లో యువత రాణించాలి: కేకే మహేందర్

ముస్తాబాద్, అక్టోబర్ 18(ప్రజా జ్యోతి):

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న గూడెపు వంశీక క్రికెట్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్, ముస్తాబాద్ ఎస్సై జ్యోతి వంశీకను అభినందించి సన్మానించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని కేకే మహేందర్ పేర్కొన్నారు. వంశీక భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆమెకు అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకొని, తమ ప్రతిభను చాటుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జాతీయ స్థాయి క్రికెట్‌కు ఎంపికై నామాపూర్ పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చిన వంశీకను ఎస్సై జ్యోతి అభినందించారు. క్రీడల్లో రాణించేందుకు పట్టుదల, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని, యువత తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నామాపూర్ గ్రామ సర్పంచ్ మాదాస్ అనిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని వంశీకను అభినందించారు.

ఘనంగా బాల్క సుమన్ జన్మదిన వేడుకలు

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

సుల్తానాబాద్, అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి) :
భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆధ్వర్యంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక

ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బాల్క సుమన్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కేసీఆర్ నాయకత్వంలో, కేటీఆర్ మార్గదర్శకత్వంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గర్రెపల్లి మాజీ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, కన్వీనర్ బోయిని రాజమల్లయ్య, నాయకులు తాళ్లపల్లి మనోజ్‌గౌడ్, తిప్పారపు దయాకర్, గుడిపాటి శ్రీనివాసరెడ్డి, గందె మల్లికార్జున్, అనుమాల బాపూరావు, సతీష్, వహీద్, మహేష్, మోయిజ్, సమీర్, కార్తీక్, మణి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మపై రాహుల్ గాంధీ చిత్రపటం

కాంగ్రెస్ నేతలు అభిమానం

ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి):
ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి చెందిన గోగూరి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ నాయకుడు ప్రతి సంవత్సరము కాంగ్రెస్ పార్టీపై

అభిమానంతో ఎన్నో తన కార్యక్రమాలు బతుకమ్మపై చిత్రీకరణ చేస్తూ ఉంటాడు ఈసారి రాహుల్ గాంధీ ఫోటోను బతుకమ్మ రూపంలో ప్రదర్శించడం అభిమానం చాటుకున్నాడు గ్రామస్తులను ఆకర్షించింది తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిభించే బతుకమ్మ పండుగకు నాయకులపై ఉన్న అభిమానం జోడిస్తూ ఆయన చేసిన ప్రయత్నాన్ని గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దుష్టిని ఆకర్షించింది ఈ పూల బతుకమ్మతో రాహుల్ గాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయడం ప్రధాన అభిమానానికి మరొకసారి చాటుకున్నాడు

ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

★ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
★ రాష్ట్రంలో రూ. 2,500 కోట్లతో ఆలయాల అభివృద్ధి,
గోదావరి పుష్కరాల పరివాహక ప్రాంతాల భక్తి క్షేత్రాలకు రూ. 2,000 కోట్లు
★ భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ. 276 కోట్లు, బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి రూ. 354 కోట్లు మంజూరు
★ రూ. 90 వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బి రహదారుల నిర్మాణం
★ రూ. 44 కోట్లతో ఎన్కూర్ నుండి నాచారం వరకు అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న రోడ్డు అభివృద్ధికి భూమి పూజ చేసిన డిప్యూటీ సీఎం



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర డిప్యూటీ సీఎం. ఆర్థిక, విద్యుత్, ప్రణాళికా శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు.ఆదివారం డిప్యూటీ సీఎం, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సీపీ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ లతో కలిసి ఏన్కురు నుండి నాచారం వరకు బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ఆపదమొక్కులవాడు, అడిగిన కోరికలు తీర్చే అద్భుత వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భవిష్యత్తులో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, వారి రవాణా సౌకర్యార్థం బీటీ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ రహదారి నిర్మాణంతో భక్తుల రాకపోకలతో పాటు స్థానికంగా హోటళు ,,వ్యాపారాలు పెరిగి ఆదాయ వనరులు పెంపొందుతాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి దాదాపు రూ. 2,500 కోట్లు వెచ్చిస్తోందన్నారు. గోదావరి పుష్కరాల నాటికి నదీ పరివాహక ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధి కోసం రూ.2,000 కోట్లు ఖర్చు చేయనున్నామని అన్నారు. చారిత్రక భద్రాచల దేవస్థాన సమగ్ర అభివృద్ధికి రూ. 276 కోట్లు కేటాయించి నిధులు మంజూరు చేశామని, పిల్లల అక్షరాభ్యాస క్షేత్రమైన బాసర దేవాలయ అభివృద్ధికి రూ. 354 కోట్లు కేటాయించామన్నారు.తెలంగాణలో కోటి 15 లక్షల కుటుంబాలు వుండగా , అందులో కోటి 6 లక్షల కుటుంబాలకు నెలకు ప్రతి మనిషికి 6 కేజీల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని డిప్యూటీ సీఎం అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచి, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు.రాష్ట్రంలో 71 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేస్తున్నామన్నారు. గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ, 53 లక్షల కుటుంబాలకు కరెంట్ బిల్లుల భారం తగ్గించామని డిప్యూటీ సీఎం అన్నారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచి, ఏటా రూ. 20 కోట్లు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందిస్తు, 5 సంవత్సరాల్లో లక్ష కోట్ల రూపాయల లక్ష్యంగా పెట్టుకున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామని, దీనికోసం ప్రభుత్వం ఇప్పటికే రూ. 10 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించిందన్నారు.ప్రతి ఇంటికి రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండవ విడత తో మొత్తంగా 8 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం వేడివేడి అల్పాహారం ఇడ్లీ, పూరీ, ఉప్మా, పాలు/రాగి జావ అందిస్తున్నామన్నారు.ప్రపంచస్థాయి ప్రమాణాలతో పోటీపడేలా ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామన్నారు.సూపర్ ఎల్నినో ప్రభావం వల్ల వర్షభావ పరిస్థితులు ఏర్పడి భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయని, వచ్చే ఏడాది జూలై వరకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున, ప్రజలు, రైతులు ప్రతి నీటి చుక్కను పొదుపుగా వాడుకోవాలని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు. నీటి సంరక్షణపై గ్రామీణ ప్రాంతాల్లో కళా బృందాలు, అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. వచ్చే నెల నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణలో పుట్టిన ప్రతి కుటుంబానికి ధీమానిచ్చేలా ఇందిరమ్మ భీమా పథకం ను ప్రారంభించబోతున్నామని డిప్యూటీ సీఎం గారు అన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని, ప్రజలందరికీ దసరా, నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. గత ప్రభుత్వం భారీగా అప్పులు మిగిల్చినప్పటికీ, కష్టకాలంలో కూడా ఆర్థిక సర్దుబాటు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక హామీలను అమలు చేస్తోందని తెలిపారు.హామహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ వంటి అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అందిస్తున్నామని తెలిపారు.హొత్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రులు నవంబర్ 6వ తేదీ లోపు తమ ఓట్లను విధిగా నమోదు చేసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతోందని, ప్రజలంతా ఈ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎంపీ కోరారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రాంత అభివృద్ధిలో రహదారుల నిర్మాణం అత్యంత కీలకమని, రహదారులు మెరుగైతే అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని అన్నారు. మారుమూల గ్రామాల వరకు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, ఏ ప్రాంతంలోనైనా రోడ్డు వసతి మెరుగైతే అన్ని రకాల అభివృద్ధి పనులు వేగవంతమవుతాయన్నారు. ఇది పోలీసింగ్ సేవల నిర్వహణకు, శాంతిభద్రతల పరిరక్షణకు, బందోబస్తు చర్యలకు ఎంతో సహాయపడుతుందని తెలిపారు.కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ, ప్రాంత ప్రజలందరికీ అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, పెద్దఎత్తున అభివృద్ధి చేయాలని జిల్లా వాసిగా, అన్ని విషయాలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడిగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం కృషి చేస్తున్నారన్నారు. గుడికి రోడ్లు వేయాలని, ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా రూ. 43 కోట్లు మంజూరు చేసి, ఏన్కూరు నుంచి నాచారం మీదుగా వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు నిధులు కేటాయించిన ఘనత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు.ఏన్కూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఐటిఐ, గోడౌన్ల మంజూరుతో పాటు ఈ ప్రాంతానికి కావలసిన రోడ్లను కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. నాచారం నుండి జూలూరుపాడు వరకు రోడ్డు మంజూరు చేయాలని, ఈ రోడ్డు నిర్మాణం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,ఖమ్మం జిల్లాలోని దాదాపు 10 మండలాలకు లింక్ కలుగుతుందని, 7 నుండి 8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందని, రోడ్డు మంజూరుకు డిప్యూటీ సీఎం కు విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు రూ.3.38 కోట్ల బ్యాంక్ లింకేజీ ఋణ చెక్కును డిప్యూటీ సీఎం అందజేశారు.అంతకుముందు డిప్యూటీ సీఎం అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్,టీజీఎన్పిడిసీఎల్ డైరెక్టర్ మోహన్ రావు, సిఈ సురేందర్,ఎస్ఈ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, స్థానిక సర్పంచ్ అజ్మీరా సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ డీసీసీబీ చైర్మన్
కూరాకుల నాగభూషణం పరామర్శ

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ఇటీవల అనారోగ్యానికి గురైన ఖమ్మం జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కూరాకుల నాగభూషణం ని స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి మర్యాదపూర్వకంగా పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసి,నాగభూషణం త్వరగా కోలుకుని పూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి రావాలని మనసారా ఆకాంక్షించారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ,సహృదయంతో సేవనందించే నాగభూషణం త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యం పొందాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రాజ్‌కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నదాన
కార్యక్రమంలో పాల్గొన్న ముదిగొండ ఎస్సై

ముదిగొండ అక్టోబర్ 18(ప్రజా జ్యోతి) ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో పాండవసేన యువకుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముదిగొండ ఎస్సై టి అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని అన్నదాన కార్యక్రమానికి ప్రతి ఒక్క మహిళలు చిన్నలు పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ. అన్ని దానాల కంటే అన్నదానం చాలా గొప్పది అని కొనియాడారు ఇలాంటి మంచి కార్యక్రమాలు ముందు ముందు మరిన్ని చేయాలని యూత్ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, ముదిరాజ్ సంఘ పెద్దలు, గ్రామ పెద్దలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సూపర్ ఎల్‌నినో ఎదుర్కొనేందుకు రానున్న 8 నెలలకు పకడ్బందీ కార్యాచరణ తయారు చేయాలి

★ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి
★ త్రాగునీటికి ప్రాధాన్యత.. యాసంగిలో వరి సాగు చేయవద్దు
★ భూగర్భ జలాల పరిరక్షణకు అనుమతులు లేని బోర్లు, ఆటో స్టార్టర్ల వినియోగాన్ని అరికట్టాలి
★ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో-ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు
★ చెరువుల నింపుదల, త్రాగునీటి నిల్వల సంరక్షణకు ప్రాధాన్యత
★ పశుగ్రాసం, పశువుల త్రాగునీటికి ఏర్పాట్లు చేయాలి
★ ఎల్నినో పరిస్థితులపై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఉన్నతాధికారులతో సమీక్షించిన ప్రత్యేక అధికారి

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి సూపర్ ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు రానున్న 8 నెలల్లో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయం,విద్యుత్,సాగునీరు,త్రాగునీరు,భూగర్భ జలాల పరిరక్షణకు పకడ్బందీ కార్యాచరణ తయారు చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు.ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు.ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి గత ఏడాది వర్షపాతంతో పోల్చి ప్రస్తుత ఏడాది మండలాల వారీగా వర్షపాత వివరాలను పరిశీలించాలని, లోటు వర్షపాతం నమోదైన మండలాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.భూగర్భ జలాలు తగ్గుతున్న మండలాలను గుర్తించి, రానున్న రోజుల్లో వాటి పరిస్థితిపై క్రమం తప్పకుండా అంచనాలు రూపొందించాలని, ఈ వివరాలను రైతులకు తెలియజేయాలని ఆదేశించారు.సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రానున్న 8 నెలలకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని, అవసరమైన సహకారం కోసం ప్రభుత్వానికి నివేదించాలని తెలిపారు.సమీక్షలో చర్చించిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేయ నున్నట్లు అన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు

ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో 5 మీటర్లు,ఎర్రుపాలెం మండలంలో 6.5 మీటర్లు, ఏన్కూరు, సత్తుపల్లి మండలాల్లో 5 మీటర్లకు పైగా భూగర్భ జలమట్టం తగ్గినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దమ్మపేట,అశ్వారావుపేట, కొత్తగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో 10 మీటర్లకు పైగా భూగర్భ జలమట్టం తగ్గినట్లు పేర్కొన్నారు.భూగర్భ జలాలను పరిరక్షించేందుకు అనధికారికంగా బోర్లు వేయడం, నీటిని తోడుకోవడాన్ని నియంత్రించాలని, వ్యవసాయ బోర్లకు ఏర్పాటు చేసిన ఆటో స్టార్టర్లను తొలగించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలాల తగ్గుదల వల్ల పంపులు,మోటార్లు,ట్రాన్స్‌ఫార్మర్లు, డీటీఆర్‌లపై భారం పెరిగే అవకాశం ఉన్నందున ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) రైతు వేదికల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,గ్రామాల వారీగా మూడు ఫేజ్‌ల విద్యుత్ సరఫరా సమయాలను ముందుగానే ప్రకటించాలని తెలిపారు. త్రాగునీటి అవసరాల కోసం మినహా కొత్త బోర్లకు అనుమతులు ఇవ్వకూడదని,బోర్లు వేసే వ్యాపారులతో సమావేశాలు నిర్వహించాలని, వాల్టా చట్టాన్ని తహసీల్దార్లు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం ఆశించిన స్థాయిలో తగ్గలేదని ప్రత్యేక అధికారి పేర్కొన్నారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో రబీ సీజన్‌లో వరి సాగు ఎట్టి పరిస్థితుల్లోనూ చేపట్టకూడదని, రబీకి కాలువల ద్వారా నీటిని విడుదల చేయబోమని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా కూడా ఆశించిన స్థాయిలో అందక పోయే అవకాశం ఉన్నందున తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటలను ప్రోత్సహించాలని, రైతులు నష్టపోకుండా ముందస్తుగా అవగాహన కల్పించాలని సూచించారు.ప్రస్తుత ఖరీఫ్ పంటల పరిరక్షణకు ప్రాధాన్యం ప్రస్తుతం సాగులో ఉన్న ఖరీఫ్ పంటలను కాపాడటం అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ఒకటి లేదా రెండు తడులు అందిస్తే పంటను కాపాడగలిగే పరిస్థితుల్లో సమీపంలోని అన్ని నీటి వనరులను పరిశీలించి, సాధ్యమైన చోట నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. భక్త రామదాసు ప్రాజెక్టు పంపుల మరమ్మతులను వెంటనే పూర్తి చేసి, వీలైనంత త్వరగా నీటి పంపింగ్ చేయాలని సూచించారు. ప్రాజెక్టుల గేట్లు,అవసరమైన చిన్నపాటి మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వర్షాధార చెరువుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా త్రాగునీటి అవసరాలకే వినియోగించాలని ప్రత్యేక అధికారి సూచించారు.చెరువుల్లో నీటిని నిల్వ ఉంచడం ద్వారా భూగర్భ జలమట్టం మెరుగుపడుతుందని తెలిపారు.

రానున్న 8 నెలలకు తాగునీటి ప్రణాళిక

రానున్న 8 నెలల త్రాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైతే ఒకటి లేదా రెండు తడులకు మాత్రమే నీటిని విడుదల చేయాలని, ప్రస్తుత పంటలను కాపాడిన అనంతరం మిగిలిన నీటిని త్రాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని సూచించారు.పాలేరు, వైరా రిజర్వాయర్లకు త్రాగునీటి అవసరాల కోసం ఎప్పుడు, ఎంత నీటిని విడుదల చేయాలనే అంశంపై స్పష్టమైన షెడ్యూల్ రూపొందించాలని తెలిపారు. ఐటీసీ,హెచ్‌డబ్ల్యూపీ నీటి సరఫరా పరిస్థితులను సమీక్షించి,అవసరమైతే రేషనింగ్ విధానాన్ని అమలు చేయాలని, త్రాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి.అనధికారిక విద్యుత్ కనెక్షన్ల కారణంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) అధిక భారాన్ని ఎదుర్కొంటున్నాయని, వాటిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. ఎండిపోయిన బోర్లను వినియోగించడం వల్ల కూడా విద్యుత్ వ్యవస్థపై అదనపు భారం పడుతోందని,అటువంటి పరిస్థితులను నియంత్రించాలని తెలిపారు.డీటీఆర్‌లలో సమస్యలు తలెత్తిన వెంటనే మరమ్మతులు చేపట్టి, తక్కువ ఓల్టేజీ సమస్యలు రాకుండా చూడాలని, పంటలు విద్యుత్ కొరత వల్ల ఎండిపోయే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు.డీటీఆర్‌ల మరమ్మతులు,సామర్థ్య విస్తరణ పనులను సమాంతరంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.గ్రామాల వారీగా మూడు ఫేజ్‌ల విద్యుత్ సరఫరా సమయాలను ముందుగానే రైతులకు తెలియజేయాలని, ఫీడర్లలో తక్కువ ఓల్టేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.పశువులకు నీరు,పశుగ్రాసం వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పశువులకు అవసరమైన నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ప్రత్యేక అధికారి సూచించారు. గ్రామాల్లో పశువులకు నీటి తొట్లు నిర్మించేందుకు వీబీ జి రాంజీ పథకాన్ని వినియోగించుకోవాలని,సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఖమ్మం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సింగరేణి,కామేపల్లి, కల్లూరు,తల్లాడ, వేంసూరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని, మిగిలిన 16 మండలాల్లో లోటు వర్షపాతం ఉందని వివరించారు. జిల్లాలో 10 మండలాలను తీవ్ర కరువు మండలాలుగా, 7 మండలాలను సాధారణ కరువు మండలాలుగా గుర్తించినట్లు వివరించారు.భూగర్భ జలాల పరిస్థితి ఖమ్మం జిల్లాలో సెప్టెంబర్ 2026 నాటికి భూగర్భ జలమట్టం 3.56 మీటర్లుగా నమోదైందని, గత ఏడాది ఇదే సమయంలో 2 మీటర్లుగా ఉందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 2026లో భూగర్భ జల మట్టం 5.02 మీటర్లుగా ఉండగా, సెప్టెంబర్‌లో కురిసిన తుపాను వర్షాల కారణంగా మెరుగుదల కనిపించిందని వివరించారు.ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 5.82 లక్షల ఎకరాలు కాగా, ఇందులో 2.41 లక్షల ఎకరాల్లో వరి, 2.35 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతున్నట్లు తెలిపారు.కల్లూరు,పెనుబల్లి,నేలకొండపల్లి,కూసుమంచి,తల్లాడ,వేంసూరం,వైరా,సత్తుపల్లి,తిరుమలాయపాలెం,ముదిగొండ 10 మండలాల్లో 83 శాతం వరి విస్తీర్ణం ఉన్నట్లు వివరించారు.సీతారామ ఎత్తిపోతల పథకం ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా అనేక చెరువులను నింపినట్లు తెలిపారు. కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వైరా ప్రాంతాలు సీతారామ సాగర్ రాజీవ్ లింక్ కెనాల్ పరిధిలో ఉన్నట్లు వివరించారు.గోదావరి జలాల ద్వారా మొత్తం 110 చెరువులకు నీరు అందించగా, వాటిలో 101 చెరువులు పూర్తిగా, 2 చెరువులు 50 శాతం, 7 చెరువులు 75 శాతం నిండినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 244 చెరువుల్లో 125 చెరువులు 75 నుండి 100 శాతం, 49 చెరువులు 50 నుండి 75 శాతం, 35 చెరువులు 50 శాతం, మరో 35 చెరువులు 25 నుండి 50 శాతం నిండినట్లు వివరించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా మరిన్ని చెరువులను నింపేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాలేరు పరిధిలో పెండింగ్‌లో ఉన్న చెరువులను నింపేందుకు నీటిని పంపింగ్ చేసే అవకాశం ఉందని వివరించారు.ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్‌లోని నీరు 84 రోజులకు సరిపోతుందని వివరించారు. ప్రస్తుత పంటలకు ఒకటి లేదా రెండు తడులు అందించడంతో పాటు వచ్చే వర్షాకాలం వరకు త్రాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉండాలంటే నాగార్జున సాగర్ నుంచి పాలేరు రిజర్వాయర్‌ను 3 సార్లు, వైరా,లంకాసాగర్ ప్రాజెక్టును ఒకసారి నింపాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌కు రానున్న 8 నెలల త్రాగునీరు అవసరాల కోసం 4.5 టీఎంసీల నీరు అవసరమని వివరించారు.గత ఏడాది 271 డీటీఆర్‌లకు మరమ్మతులు చేపట్టగా, ఈ ఏడాది ఇప్పటివరకు 341 డీటీఆర్‌లకు మరమ్మతులు చేసినట్లు వివరించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్ మాట్లాడుతూలి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 26.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్టోబర్ 2026లో భూగర్భ జలమట్టం 7.76 మీటర్లుగా ఉండగా, అక్టోబర్ 2025లో 5.08 మీటర్లుగా నమోదైందని గత ఏడాదితో పోలిస్తే 2.68 మీటర్ల మేర తగ్గుదల నమోదైందని వివరించారు.తాలిపేరు ప్రాజెక్టు ద్వారా 24,700 ఎకరాల ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. దుమ్ముగూడెం వద్ద 1 మీటరు ఎత్తులో ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తే 1 టీఎంసీ వరకు నీటిని నిల్వ చేసే అవకాశం ఉందని వివరించారు.ప్రస్తుతం ఉద్యాన పంటలు ఎండిపోయే పరిస్థితి లేదని,ఖరీఫ్‌లోనూ పెద్దగా ఇబ్బందులు లేవని తెలిపారు. రానున్న రోజుల్లో వర్షాధార పంటలు,పప్పు ధాన్యాలు,నూనెగింజల సాగును ప్రోత్సహించాలని వివరించారు. గత ఏడాది 175 డీటీఆర్‌లకు, ఈ ఏడాది 214 డీటీఆర్‌లకు మరమ్మతులు చేసినట్లు వివరించారు.ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్, భూగర్భజల, విద్యుత్, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 అవార్డుల ప్రదానోత్సవం

హైదరాబాద్, అక్టోబర్ 18(ప్రజాజ్యోతి): తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్ప కళావేదికలో జరిగిన బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్

ఛాలెంజ్ అవార్డుల ప్రదానోత్సవానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లఘుచిత్రాలు, బతుకమ్మ పాటలు, జానపదగీతాలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, ఆర్టికల్స్ విభాగాల కింద దర్శకుడు హరీష్ శంకర్ నేతృత్వంలోని జ్యూరీ ఎంపిక చేసిన మొత్తం 29మంది విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. యువతలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.
ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమం వర్ధమాన చిత్రనిర్మాతలకు తమ ప్రతిభను చాటుకునేందుకు గొప్ప వేదికగా నిలిచిందని పేర్కొన్నారు.
ఈ పోటీలో సుమారు 2,600కు పైగా ఎంట్రీలు రావడం తెలంగాణ యువతలోని సృజనాత్మక శక్తికి నిదర్శనమన్నారు. తెలుగు సినీ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, హైదరాబాద్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ చలనచిత్ర నిర్మాణ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సినిమా అనేది కేవలం వినోద సాధనం మాత్రమే కాదని, సమాజంలో మార్పు తీసుకురాగల శక్తివంతమైన మాధ్యమమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, సూపర్ ఎల్ నినో ప్రభావాలు, నీటి సంరక్షణ వంటి కీలక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా యువ చిత్రనిర్మాతలు తమ సృజనాత్మకతను వినియోగించుకోవాలని సూచించారు.
ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో విద్యనభ్యసించిన కళాభిమానిగా సృజనాత్మక రంగాల అభివృద్ధిపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తారని తెలిపారు. యువ కళాకారులను ప్రోత్సహించడం, వారికి తగిన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యతల్లో భాగమని అన్నారు.
హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి చలనచిత్ర నిర్మాణ సంస్థలు, స్టూడియోలను ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, తద్వారా నగరానికి ప్రపంచ సినిమా రంగంలో మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణలో ఉన్న అపారమైన ప్రతిభ, సాంకేతిక సామర్థ్యం, సృజనాత్మక వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి సినిమా కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వివరించారు. అనంతరం "ప్రజా పాలనలో నవశకం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ

కార్యక్రమాన్ని సమన్వయం చేసిన రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజును, బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ బృందాన్ని, టీజీఎఫ్‌డీసీ సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, టీజీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, కార్పొరేషన్ చైర్మన్లు శ్రీనివాస్ రెడ్డి, వెన్నెల గద్దర్, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు, టీజీఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ముకుంద రెడ్డి, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబు, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.మామిడి హరికృష్ణ, నటి అనుపమ పరమేశ్వరన్, సీనియర్ నటుడు నరేష్, జాతీయ అవార్డు గ్రహీత శ్యామ్ కాసర్ల, పీజీ వింద, రచ్చ రవి, విమలక్క, అంతడుపుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లఘుచిత్రాల విభాగం:

– ప్రథమ బహుమతి: 'యక్షగానం' – రామ్ తలైవి (రూ.3 లక్షలు)
– ద్వితీయ బహుమతి: 'నా ఇంటి బతుకమ్మ' – అభివన్ సందబోయిన (రూ.2 లక్షలు)
– తృతీయ బహుమతి: 'ఇల్లు వెలుగు' – ప్రభువన్ రాజ్ (రూ.1 లక్ష)

బతుకమ్మ పాటల విభాగం

– ప్రథమ బహుమతి: 'బతుకమ్మ పాట 2026' – వరం (రూ.3 లక్షలు)
– ద్వితీయ బహుమతి: 'తలెత్తుకుంది బతుకమ్మ' – అశ్విని రాథోడ్ (రూ.2 లక్షలు)
– తృతీయ బహుమతి: 'బజ్జి బతుకమ్మ' – మనీషా పటేల్ దొడ్లే (రూ.1 లక్ష)

జానపద గీతాల విభాగం

– ప్రథమ బహుమతి: 'వన్ రాంగ్ స్టెప్' – డా. కుమారస్వామి (రూ.3 లక్షలు)
– ద్వితీయ బహుమతి: 'అమ్మ నవ్వింది' – శ్రీను ముదిరాజ్ (రూ.2 లక్షలు)
– తృతీయ బహుమతి: 'ఇది మాయేనా' – వంశీ చారి (రూ.1 లక్ష)

వ్యాసాల విభాగం

– ప్రథమ బహుమతి: 'వెయ్యి రోజుల వెలుగు రేఖలు' – వినీల్ కాంత్ మానవరపు (రూ.1 లక్ష)
– ద్వితీయ బహుమతి: 'హైదరాబాద్ హైడ్రా' – పిల్లి పద్మ యాదవ్ (రూ.50 వేలు)
– తృతీయ బహుమతి: 'మా అమ్మ మహాలక్ష్మి' – బెన్ రాజ్ బకారం (రూ.30 వేలు)

ఇన్‌ఫ్లుయెన్సర్ వీడియోల విభాగం

– ప్రథమ బహుమతి: 'పెత్తరమాస' – ప్రసాద్ హైడ్రాబోయిని (రూ.1 లక్ష)
– ద్వితీయ బహుమతి: 'ప్రజా పాలన ప్రభుత్వ పథకాలు' – హర్షిని మేకల (రూ.50 వేలు)
– తృతీయ బహుమతి: 'హిస్టరీ & కల్చర్ ఆఫ్ తెలంగాణ' – పిట్టల శ్రవణ్ (రూ.30 వేలు)

టామ్‌కామ్ వ్యవహారంపై సీఐడీ విచారణ జరిపించాలి

మొదటిపేజీ తరువాయి..

ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై విమర్శలు చేశారు.టామ్‌కామ్ వసూలు చేసిన ప్రతి పైసాను బాధితులకు వెంటనే వాపస్ చేయడంతోపాటు, వారి విలువైన సమయాన్ని వృథా చేసినందుకు నష్టపరిహారం చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. మోసపోయిన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఈ టామ్‌కామ్ వ్యవహారంపై సీఐడీ లేదా న్యాయ విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కౌన్సిలర్ కృషితో తొలగిన చీకట్లు

13వార్డులో హైమాస్ట్ లైట్ల వెలుగులు
కౌన్సిలర్ ఎర్ర విశాలి నాగరాజ్ గౌడ్ కి వార్డు ప్రజల అభినందనలు

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలచే మన్ననలు పొందుతున్నారు సదాశివపేట పట్టణంలోని 13వ వార్డు

కౌన్సిలర్ విశాలి ఎన్నికల్లో ప్రజలకు చేసిన వాగ్దానాలను ఒకొక్కటిగా నెరవేరుస్తూ ఆమె ముందుకు పోతున్నారు.
ప్రజా సమస్యలే ధ్యేయంగా పనిచేస్తున్న 13వ వార్డు కౌన్సిలర్ వార్డులో ఎర్ర విశాలి నాగరాజ్ గౌడ్ వార్డులో శ్రీరామ కళామందిరం ప్రధాన కూడలి అనునిత్యం చీకట్లో మగ్గుతుండడంతో ప్రజలు సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ విశాలి దృష్టికి తీసుకువచ్చారు. రాత్రి సమయంలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు, వికలాంగులు, నైట్ డ్యూటీ కి వెళ్లే కార్మికుల ఇబ్బందులను ఆకలింపు చేసుకున్న కౌన్సిలర్ ఎర్ర విశాలి వెంటనే మున్సిపల్ అధికారులతో చర్చించి యుద్ధ ప్రాతిపదికన శ్రీరామ కళామందిరం ప్రధాన కూడలిలో భారీ హై మాస్ట్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయించారు ఇప్పుడు శ్రీరామ కళామందిరం ప్రధాన కూడలి రాత్రి వేళల్లో హైమాస్ట్ లైటింగ్ సిస్టం వెలుగుల్లో పట్టపగలను తలపిస్తుండడంతో వార్డు ప్రజలు ఎన్నో ఏళ్లుగా నెలకొని ఉన్న సమస్యను ఒకటి రెండు రోజుల్లో పరిష్కరించిన వార్డు కౌన్సిలర్ ఎర్ర విశాలి నాగరాజు గౌడ్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ వార్డు అభివృద్ధికి కౌన్సిలర్ ఎర్ర విశాలి చేస్తున్న కృషి పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ, బిఆర్ఎస్ నాయకులు చింత సాయి డిడిగే నాగేష్, అడ్వకేట్ సంశేయ్, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరా పండుగ లను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలి

నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవు
పట్టణంలో ఉన్న రౌడీషీటర్లకు సీఐ, సట్ల రాజు కౌన్సిలింగ్

భద్రాచలం, అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి) భద్రాచలం పట్టణంలో బతుకమ్మ, దసరా పండుగ లను ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా భద్రాచలం సీఐ, సట్ల రాజు పట్టణ పరిధిలో ఉన్న రౌడీషీటర్లను ఆదివారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. బతుకమ్మ, దసరా పండుగ ల సమయంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, నిబంధనలు ఉల్లంఘించినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా బతుకమ్మ ను, దసరా పండుగ వేడుకలను ప్రజలు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, ప్రజలు అందరు కూడా పోలీస్ వారికీ సహకరించాలని ఆయన తెలిపారు.

25 అవార్డులతో లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం విజయ దుందుభి

ఖమ్మం జిల్లాలో అత్యధిక అవార్డులు సాధించిన క్లబ్‌గా గుర్తింపు
ఉత్తమ అధ్యక్షురాలు అవార్డు అందుకున్న పి. కమలా రాజశేఖర్

భద్రాచలం, అక్టోబర్ 18 (ప్రజా జ్యోతి): ప్రజాసేవా కార్యక్రమాలకు గుర్తింపుగా లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం 25 అవార్డులను సాధించింది. నల్గొండలోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన లయన్స్ ఇంటర్నేషనల్ 320ఈ ఎక్సెల్ అవార్డుల వేడుకల్లో ఈ పురస్కారాలు అందుకుంది. ఖమ్మం జిల్లాలో అత్యధిక అవార్డులు సాధించిన క్లబ్‌గా గుర్తింపు పొందింది. 2025–2026 సంవత్సరంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు ఈ అవార్డులు లభించాయి. వ్యక్తిగత విభాగాల్లో ఏగి సూర్యనారాయణకు ఉత్తమ ప్రత్యేక అవార్డు, కురిచేటి శ్రీనివాస్‌కు ఉత్తమ జోనల్ చైర్మన్, పి. కమలా రాజశేఖర్‌కు ఉత్తమ అధ్యక్షురాలు, మోర్తాల సిద్ధారెడ్డికి ఉత్తమ కార్యదర్శి, యడ్లపల్లి రామారావుకు ఉత్తమ కోశాధికారి అవార్డులు దక్కాయి.
మీల్స్ ఆన్ వీల్స్ సేవా విభాగంలో మోర్తాల సిద్ధారెడ్డి, పవన్ గుడికందుల, అనుగోజి నరసింహాచారి అవార్డులు అందుకున్నారు. అత్యుత్తమ సేవా విభాగంలో భీమవరపు

వెంకటరెడ్డి, పి. దేశప్ప, జి. శివశంకర్, చావ లక్ష్మీనారాయణ గుర్తింపు పొందారు.

వాడవాడలా మహిళల ఆట పాటలతో...
అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

హైదరాబాద్, అక్టోబర్ 18: నగరంలోని సద్దుల బతుకమ్మ వేడుకలు శనివారం వాడవాడలా ఘనంగా జరిగాయి. ఎంగిలి పూల బతుకమ్మ తో

ప్రారంభమైన బతుకమ్మ పండుగ వేడుకలు సద్దుల బతుకమ్మ తో ముగిశాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. మహిళలు ఆనందోత్సాహాలతో ఆట పాటలతో ఉత్సాహంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజుల తెలంగాణ అడపడుచుల పూల పండుగ ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వాడవాడలా ఉత్సాహంగా జరుపుకున్నారు. రాక్ టౌన్ కాలనీ లోని స్థానిక రెసిడెన్సీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కాలనీ మైదానంలో వందలాది మంది మహిళలు ఆట పాటలతో బతుకమ్మ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు.కాలనీలోని ఏసీఈ రత్న పర్ల్

అపార్ట్మెంట్ లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. అపార్ట్మెంట్ మహిళలు తీరొక్క పూలతో పేర్చిన సద్దుల బతుకమ్మలతో వేడుకలు జరుపుకున్నారు. ఆట పాటలతో జరిగిన వేడుకల అనంతరం బతుకమ్మలను స్థానిక సొసైటీ మైదానంలో ఏర్పాటు చేసి నీటి కొలనులో సాగనంపారు.

బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్ పై కాల్పులు

మొదటిపేజీ తరువాయి..

ఐదు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉండగా, ఆయన కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నానావతి ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో సమీపంలో ఉన్న ఒక ఆటో డ్రైవర్‌కు కూడా గాయాలైనట్లు సమాచారం. ఘటన గురించి తెలియగానే ముంబై పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. డీసీపీ మోహిత్ గార్గ్ సహ ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించారు. టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దుండగులను పట్టుకోవడానికి దాదాపు 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఇదిలా ఉండగా, ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు విదేశాల్లో ఉంటున్న గ్యాంగ్‌స్టర్లు అనిల్ పండిట్, హర్మన్ సంధులు సోషల్ మీడియాలో ప్రకటించారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ తరఫున ఈ పోస్ట్ పెట్టినట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్‌తో పనిచేసే వారిని లక్ష్యంగా చేసుకుంటామని గతంలోనే హెచ్చరించామని, అందులో భాగంగానే ఈ దాడి జరిగిందని వారు పేర్కొన్నట్లు సమాచారం. అయితే, ఈ సోషల్ మీడియా పోస్టును ముంబై పోలీసులు ఇంకా అధికారికంగా ధ్రువీకరించలేదు. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు కొనసాగుతోంది. కాగా ఈ ఘటన అనంతరం మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే ఆదివారం టైగర్ ష్రాఫ్ నివాసానికి వెళ్లి ఆయన్ను, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ దాడి ఘటన తర్వాత టైగర్ ష్రాఫ్‌కు సంబంధించిన తొలి చిత్రాలు బయటకు వచ్చాయి. అందులో 'భాగీ' నటుడి చేతికి బ్యాండేజ్, భుజం మరియు ఛాతీ భాగాల్లో డ్రెస్సింగ్ వేసి ఉండటం కనిపించింది.
నటుడితో భేటీ అనంతరం శిందే మీడియాతో మాట్లాడుతూ కీలక వివరాలు వెల్లడించారు. గన్‌పౌడర్, పగిలిన గాజు పెంకుల వల్ల టైగర్ ష్రాఫ్ గాయపడ్డారని తెలిపారు. "ఇది చాలా తీవ్రమైన ఘటన. నిందితులు సుమారు ఐదు రౌండ్లు కాల్పులు జరిపారు. అదృష్టవశాత్తూ టైగర్ ప్రాణాపాయం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఆయన డ్రైవర్ ఈ దాడిలో గాయపడ్డారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. నేను నటుడిని స్వయంగా కలిసి మాట్లాడాను. గన్‌పౌడర్, గాజు పెంకులు గుచ్చుకోవడంతో ఆయన చేతికి గాయాలయ్యాయి. ఈ పరిణామంతో టైగర్, ఆయన తల్లి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు" అని శిందే పేర్కొన్నారు. ముంబై నగరంలో ఇలాంటి గ్యాంగ్ వార్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, కాల్పుల వెనుక ఉన్న నిందితులపై అత్యంత కఠినమైన చర్యలు ఉంటాయని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967